# ఘనంగా గంగపుత్రుల బోనాలు





మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) ఆదివారం సాయంత్రము రోజున నేరేడ్మెట్ భగత్ సింగ్ నగర్ గంగపుత్రులు బోనాలు అంగరంగ వైభవంగా ఎంతో ఘనంగా చల్లపంధిర నీడలో ఘనంగా కనువిందుగా కట్టమైసమ్మకు బోనాలు తీయడం జరిగినది. ఇట్టి కార్యక్రమం ఎంతో సంతోషంగా గత 44 సంవత్సరాల నుండి ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో ఘనంగా నిర్వహించారు.

# పది రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కన్నాల గ్రామంలో ఇల్లు పూర్తిగా కూలిపోవడం జరిగింది



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన పోయిల రాయమల్లు అతని తమ్ముడైన పోయిల రాములు ఇల్లు గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి పూర్తిగా కూలిపోవడం జరిగింది నిరుపేదలైన వారి కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను ప్రభుత్వాన్ని మంథని మండల ఎమ్మార్వో వెంటనే స్పందించి నిరుపేదలైన రాయమల్లుకు ప్రభుత్వము నుంచి సాయం అందించాలని ఎమ్మార్వోని కోరుతున్నారు ప్రజలు ఉండడానికి గూడు లేని పేదలను ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు చేయించాలని వారు కోరుతున్నారు.

# సత్యనారాయణ కూతురు సాహితీ లూపస్ వ్యాధితో మరణించింది



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని రెవెన్యూ డివిజన్ పరిధిలోని కలవచర్ల గ్రామానికి చెందిన కట్ట సత్యనారాయణ కూతురు కట్టా సాహితి నిన్న రాత్రి 7 గంటలకు హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలోలూపస్ అనే వ్యాధితో అకాల మరణం చెందినది వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సాహితి చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ జడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# శిల్పారామంలో అలరించిన భరతనాట్య నృత్య ప్రదర్శన



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) మాదాపూర్ లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కువైట్ నుండి విచ్చేసిన కూచిపూడి నాట్య గురువులు చల్లా వేదవల్లి ప్రసాద్, శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన అత్యంత వైభవంగా అలరించారు. వినాయక కౌతం, సరస్వతి స్తుతి, ఆధ్యాత్మ రామాయణ కీర్తన,నారాయణ తీర్థుల తరంగం, దుర్గ స్తుతి, మండూక శబ్దం, దశావతారాలు, కొలువైతివారంగా సాయి, గోవిందా నామాలు, మొదలైన అంశాలను కళాకారులూ విష్ణు ప్రియా, ఆరాధ్య, నేహా, వేదశ్రీ,ధన్య, శ్రీమోహన, సాయిమణిశ్రీ,రాగ, వైష్ణవి, కార్తీక ,సంజన, షణ్ముఖ లక్ష్మి, సౌమ్య, అనన్య మొదలైన కళాకారులు ప్రదర్శించి చూపరులను ఎంతగానో మెప్పించారు. ఈ కళాకారులూ అందరు కువైట్ నుండి విచ్చేసిన వారు కావడం విశేషం.

# ఈనెల 30న శ్రీశైలం డ్యామ్ గెట్ల ఎత్తివేత



శ్రీశైలం ( ప్రశ్న న్యూస్)ఈనెల 30న శ్రీశైలం డ్యామ్ గేట్లను ఎత్తి నాగార్జున సాగర్కు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన ఇంజినీర్ అధికారులతో కలిసి డ్యామ్ వద్ద పరిస్థితిని సమీక్షించారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా మంగళవారం ఉదయం 11 గంటలకు 5 లేదా 6 గేట్లను ఎత్తి నీటి విడుదల చేస్తారన్నారు.శ్రీశైలం డ్యామ్ 870 అడుగులు.శ్రీశైలం డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు. నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు. కాగా ఆదివారం ఉదయం 6 గంటల సమయానికి 870.10 అడుగులకు చేరింది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల ద్వారా 4,09,591 వరద నీరు వచ్చి చేరింది. విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 62,214 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ కు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 142.0164 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

# కైసర్‌నగర్‌లో వైభవంగా బోనాల ఉత్సవాలు

- అమ్మవార్లకు బోనం, మొక్కుబడులు సమర్పించిన మహిళలు
- అలరించిన పోతరాజుల విన్యాసాలు, డప్పు కళా ప్రదర్శన
- ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ రావుల శేషగిరిరావు







కుత్బుల్లాపూర్(ప్రశ్న న్యూస్) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 125 గాజులరామారం డివిజన్ పరిధిలోని కైసర్ నగర్‌లో గల శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలను ఆలయ కమిటీ ఛైర్మన్ మద్దెల సాయిబాబా ఆధ్వర్యంలో భక్తజనసందోహం మధ్య అత్యంత వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు ఉదయం నుండే అత్యంత భక్తి శ్రద్ధలతో, నియమ నిష్టలతో అమ్మవార్లకు బోనం, నైవేద్యాలు తయారు చేసి తమ తమ ఇళ్ల నుండి బోనం ఎత్తుకుని కుటుంబ సభ్యులతో కలిసి డప్పు చప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి తరలివెళ్లి బోనం, మొక్కుబడులు సమర్పించి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో గత రెండేళ్లుగా ఆలయ కమిటీ ఛైర్మన్ మద్దెల సాయిబాబా ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత వైభవంగా నిర్వహిస్తుండటం విశేషం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ఈ బోనాల ఉత్సవాల నిర్వహణ కైసర్‌నగర్‌లో గతంతో పోల్చితే ప్రస్తుతం ఎంతో మార్పు చెందిందని, మహిళలు కూడా పెద్ద ఎత్తున ఉత్సాహంగా ఆలయానికి వస్తూ అమ్మవార్లకు బోనం, మొక్కబడులు మర్పించడం, ఆలయ కమిటీ సభ్యులు కూడా వారం రోజుల ముందు నుండే ఉత్సవాలకు కావాల్సిన ఏర్పాట్లు చూస్తుండటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఆలయ కమిటీని అభినందిస్తున్నారు. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి రావు ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు కార్పొరేటర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం తెలిపారు. అనంతరం కార్పొరేటర్‌ను ఆలయ ఛైర్మన్ సాయిబాబా శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ బోనాల ఉత్సవాలు విజయవంతం పట్ల కార్పొరేటర్ రావుల శేషగిరి ఆలయ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మసూద్, అజయ్ ప్రసాద్ గుప్తా, ఆలయ కమిటీ వైస్ ఛైర్మన్ వై. బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ పి. శ్రీనివాసరావు, సత్యనారాయణ, ట్రెజరర్, ఎస్. రాజు యాదవ్, రవిందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు

**-ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగ సందర్భంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఇజ్జత్ నగర్,సాయినగర్ లో గల అమ్మవారి దేవాలయంలో బోనాల ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగ సందర్భంగా ప్రజలందరికి శు భాకాంక్షలు తెలిపారు.అమ్మవారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నానని తెలియచేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని వాడవాడలో బోనాల జాతర వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకోవలనే ఉద్దేశ్యంతో నియోజకవర్గంలోని ప్రతి గుడికి బోనాల నిధులు మంజూరయేలా కృషి చేశానని,బోనాలు అంగరంగ వైభవంగా జరుపుకునేల బోనాలు నిర్వహించుకొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని మతాల వారు అంగరంగా వైభవంగ పండుగ జరుపుకునేల కృషి చేస్తున్నారని తెలిపారు. బోనాల సందర్భంగా ప్రతి గుడి వద్ద అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేశామని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండ అన్ని రకాల వసతులు కలిపిస్తూ ప్రశాంత వాతావరణం కలిపించమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ ,ప్రసాద్, రాంచందర్, సంతోష్ లక్ష్మణ్ నాయక్, గోపాల్ నాయక్, భక్తులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖంగా ఉండాలి

**- గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి,నేతాజీ నగర్,నల్లగండ్ల, టీఎన్జీవోస్ కాలనీ,జీపీఆర్ఏ క్వార్టర్స్ ఖాజాగూడ,రాయదుర్గం, బీహెచ్ఈఎల్, లలో బోనాల పండుగ సందర్భంగా ఆదివారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. ఆషాడ,శ్రావణ మాసాల్లో బోనాల పండుగను తెలంగాణ ప్రజలు ఎంతో భక్తితో నిర్వహిస్తారని,మన సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ఒక ప్రతీక అని అన్నారు. అమ్మవారి దీవెనల కోసం బోనమెత్తే ప్రతి ఆడబిడ్డ హిందూ సంస్కృతికి నిజమైన వారసురాలని అన్నారు. గచ్చిబౌలి డివిజన్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాలనీ అసోషషన్ సభులు, ఆయా దేవాలయ కమిటీ సభ్యులు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గచ్చిబౌలి డివిజన్ లో ఘనంగా బోనాల పండుగ ఉత్సవాలు

**-ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా**



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.బోనాల పండుగ ఉత్సవాలకు మాజీ కార్పొరేటర్ సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు,పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) ఆషాఢ మాస బోనాలు సందర్భంగా ఆదివారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రజలందరికి, బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తూ సహకరిస్తుందన్నారు. బోనాల పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని వేడుకున్నారు,అందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, మాజీ కౌన్సిలర్ లు, సీనియర్ నాయకులు, మిరియాల రాఘవ రావు, రామ్ మోహన్ రెడ్డి,శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్,గోపాల్ యాదవ్,కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్,ఆలయ కమిటీ నిర్వాహకులు,భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మంథని పట్టణంలోవాహనాలను తనిఖీ



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలో ఓల్డ్ పెట్రోల్ పంపు దగ్గర సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.రాజు రామగిరి ఎస్ఐ. సందీప్ కుమార్ ఆధ్వర్యంలో మంథని పోలీసు సిబ్బంది వాహనాలు



తనిఖీ చేయడం జరిగింది .ఇట్టి తనిఖీలో భాగంగా నెంబర్ ప్లేట్ లేని సరియైన పత్రాలు లేని వాహనాలను తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరిగింది. సరైన పత్రాలు లేని హెల్మెట్ లేని వాహనాల పైన చలాన్లు వేయడం జరిగింది. బ్లాక్ ఫిల్మ్ ఉన్న వాహనాలను గుర్తించి అట్టి వాహనాల యొక్క బ్లాక్ ఫిల్మోలగించడం జరిగింది.సరియైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన మద్యం త్రాగి వాహనాలు నడిపిన హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన అట్టి వ్యక్తుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోబడును అని సిఐ . తెలిపినారు.

## కైసర్‌నగర్ బోనాల ఉత్సవాల్లో

# పాల్గొన్న వార్డు మెంబర్ మసూద్



కుత్బుల్లాపూర్(ప్రశ్న న్యూస్) గాజులరామారం డివిజన్ పరిధిలోని కైసర్ నగర్‌లో గల శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో వార్డుమెంబర్ మసూద్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. మసూద్ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఛైర్మన్ మద్దెల సాయిబాబా ఆధ్వర్యంలో కైసర్‌నగర్‌లో గత రెండేళ్లుగా ఈ బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని, భక్తులు కూడా పెద్ద ఎత్తున బోనాలు, మొక్కుబడులను అమ్మవార్లకు సమర్పించి దర్శించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు అజయ్ ప్రసాద్ గుప్తా, ఆలయ కమిటీ వైస్ ఛైర్మన్ వై. బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ పి. శ్రీనివాసరావు, సత్యనారాయణ, రాజు యాదవ్, రవిందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఇందూరు ఊర పండుగ

## - ఆకట్టుకున్న పోత రాజుల విన్యాసాలు



నిజామాబాద్( ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా నగరంలో ఆదివారం ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి ప్రతిరూపంగా తొట్టెలను ఊరేగించారు ఈ తొట్టెల కింద నుంచి వెళ్లేందుకు జనం పోటీపడ్డారు చిన్నా పెద్ద తేడా లేకుండా తొట్టెల కింద కూర్చొని ఆయు ఆరోగ్యాలు ప్రసాదించు తల్లి అంటూ అమ్మవారిని వేడుకున్నారు. ఆరాధ్య దేవతలైన గ్రామ దేవతలను వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఎలాంటి రోగాలు రాకుండా చూడాలని అమ్మవారిని కొలుస్తూ ఊర పండుగను ఘనంగా నిర్వహించారు.

## బొమ్మనపల్లి గ్రామస్తులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో

# కూరగాయల పంపిణీ.



వాజేడు (ప్రశ్న న్యూస్ ) ములుగు జిల్లా వాజేడు మండలం ఏడు చర్లపల్లి పంచాయతీ బొమ్మలపల్లి గ్రామస్తులకు, ఆదివారం వాజేడు పోలీసుల ఆధ్వర్యంలో కూరగాయల పంపిణీ చేశారు. భారీ వర్షాలు గోదావరి వరదల కారణంగా బొమ్మనపల్లి గ్రామాన్ని, వరద నీరు చుట్టుముట్టడంతో గ్రామస్తులు అష్ట కష్టాలు పడ్డారు. గత రెండు రోజులుగా గోదావరి వరద తగ్గిపోవడంతో పాటు, భారీ వర్షాలు కూడా తగ్గు మొఖం పట్టడంతో, బొమ్మలపల్లి గ్రామస్తులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. వరదలతో,భారీ వర్షాలతో సతమతమవుతున్న బొమ్మలపల్లి గ్రామస్తులకు ఎంతో కొంత, ఊరట కలిపించేందుకు పోలీస్ శాఖ తమ వంతు సహాయం గా ప్రతి కుటుంబానికి కూరగాయల పార్సిల్సు పంపిణీ చేశారు. ఈ మేరకు వెంకటాపురం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బండారి కుమార్ ఆధ్వర్యంలో,ఆయన చేతుల మీదుగా గ్రామస్తులకు ఆదివారం కూరగాయల పార్సిల్ లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాజేడు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ హరీష్ మరియు ఏడుచర్లపల్లి పంచాయతీ కార్యదర్శి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అమ్మకు సమర్పించే నైవేద్యంమే భోనం

**- యమునా బాయి**





సుల్తాన్ బజార్(ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతికి దర్పంపట్టే ఆషాడమాస భోనాలను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆషాడ మాస భోనాల సందర్భంగా సుల్తాన్ బజార్ బడీచౌడీలో వెలసిన ధనలక్ష్మి మైసమ్మ ఆలయంలో ఆదివారంనాడు భోనాల పండగను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో కన్నుల పండగగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో వేకువజాముననే అభిషేకాలతో ప్రారంభమైన ప్రత్యేక పూజలు,అమ్మవారికి భోనాల సమర్పణ, ఘటాల ఉరేగింపు వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భోనం అంటే అమ్మకు సమర్పించే నైవేద్యం. మహిళలు వండిన అన్నంతో పాటు పాలు, పెరుగు, బెల్లం, ఉల్లిపాయలతో కూడిన పదార్థాలను ప్రత్యేకంగా అలంకరించిన మట్టి లేక రాగి కుండలలో ఉంచి తమ తలపై ఎత్తుకొని మేళతాలలతో ఊరేగింపుగా అమ్మగుడికి వెల్లారు. మహిళలు తీసుకెళ్ళే ఈ బోనాల కుండలపై వేప రెమ్మలు, పసుపు, కుంకుమ కడి (తెల్ల ముగ్గు) తో అలంకరించి, దానిపై ఒక దీపం ఉంచడం సంప్పదాయంగా వస్తున్న ఆచారమని భక్తులు తెలిపారు. భోనాల సందర్భంగా ధనలక్ష్మి మైసమ్మ ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు. భోనాల సందర్భంగా జయకరన్ సావంత్, యమునా బాయి నివాసం నుండి ప్రారంభమైన ఘటాల ఉరేగింపు సుల్తాన్ బజార్ ప్రధాన రహదారుల్లో సాగి అమ్మకు భోనాన్ని సమర్దించారు. ఈ కార్యక్రమంలో శాంత్ కుమార్ సావంత్ తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలంలో వెలిసిన ముళ్లచెదలను,

# చెత్తను శుభ్రం చేయించిన కౌన్సిలర్

**కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు**





గద్వాల టౌన్(ప్రశ్న న్యూస్) శుభ్రత పరిశుభ్రత భాగంలో గద్వాల పట్టణంలోని 18వ వార్డు పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల ఓ ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు చెత్తాచెదారంతో నిండి ఉండడంతో దోమలు ప్రబలుతున్నాయని వాటిలో పాములు కూడా తరచూ తిరుగుతున్నాయని ఆరు బయట పిల్లలు ఆడుకునే క్రమంలో పాములు కాటు వేసే ప్రమాదం ఉందని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు ఆదివారం వార్డు కౌన్సిలర్ నరహరి గౌడు కు విషయం తెలుపగా ఆయన వెంటనే స్పందించి ఆ ఖాళీ స్థలంలోని చెత్తాచెదారాన్ని జెసిబి సహాయంతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నరహరి గౌడ్ మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెత్త చెదారాన్ని బయట వేయకుండా చెత్తను మున్సిపాలిటీ కి చెందిన చెత్తను సేకరించే చెత్త ఆటోలో వేయాలని ఆయన తెలిపారు కాగా మన వార్డులో ఏ సమస్యలున్నా వెంటనే నా దృష్టికి తీసుకురావాలని ఆయన కాలనీవాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జహంగీర్ అంజి అన్వేష్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కుషాయిగూడ బోనాలు



కుషాయిగూడ (ప్రశ్నన్యూస్) కుషాయిగూడ చక్రిపురం మహంకాళి ఆలయంలో అమ్మవారి బోనాల పండుగ ఘనంగా జరిగాయి.ఉదయం నుండే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.ట్రాఫిక్కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు అన్ని చర్యలు తీసుకున్నారు.

## బొగతజలపాతం సందర్శనకు

# అటవీశాఖ గ్రీన్ సిగ్నల్

**తండోపతండాలుగా తరలివస్తున్న పర్యాటకులు**



వాజేడు (ప్రశ్న న్యూస్ ) ములుగు జిల్లా వాజేడు మండలం బొగత జలపాతం ను వారం రోజులు క్రితం అధికారులు మూసివేశారు. భారీ వర్షాలు,వరదలు కారణంగా రికార్డు స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న జలపాతం ప్రమాదకరంగా మారడంతో, ఉన్నతాధికారుఆదేశంపై జలపాతం



సందర్శను మూసివేశారు. భారీ వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో ఆదివారం నుండి జలపాతం సందర్శనకు అనుమతి ఇచ్చారు. అయితే పర్యాటకులు కేవలం జలపాతం అందాలను మాత్రమే తిలకించాలని, స్నానాలు చేయరాదని, వాటర్ లోకి దిగరాదని ఆంక్షలు విధించారు. అలాగే మద్యం, ఇతర మత్తు పదార్థాలను కలిగి ఉండరాదని అటువంటి వారిపై చట్ట పర చర్యలు తీసుకోవడం జరుగుతుందని ,వాజేడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. చంద్రమౌళి తెలిపారు.

# అమ్మ వారి ఆశీస్సులు ప్రజల పై ఉండాలి

**- విజయ్ కుమార్ గౌడ్**



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) గ్రామదేవతల దయ ప్రజలందరి పై ఉండాలని అంబర్ పేట కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ అన్నారు. బోనాల వేడుకల సందర్భంగా ఆదివారం అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తాలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరి పై ఉండాలని ఈ సందర్భంగా అన్నారు.ఈ పూజా కార్యక్రమంలో బిజెపి యువమోర్చా నగర ప్రధాన కార్యదర్శి యశ్వంత్, అంబర్ పేట నియోజకవర్గం వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ (ఏపీడబ్ల్యూజేఏ) అధ్యక్షులు పుండరీ చారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హుజూర్నగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్

## ప్రెసిడెంట్ గా నన్ను గెలిపించండి: కర్ణం మధుసూదన్



హుజుర నగర్(ప్రశ్న న్యూస్) హుజూర్నగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా నన్ను గెలిపించండి అని కర్ణం మహేష్ కోరారు.ఒక సందర్భంలో ఆయన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంలో సేవా కార్యక్రమాలు చేశాను. మా తండ్రి కర్ణం భద్రయ్య 35 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలోనే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు . హుజూర్నగర్ నియోజకవర్గం ప్రజలందరూ గమనించి హుజూర్నగర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా నన్ను గెలిపిస్తే గాంధీభవన్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం గురించి రేవంత్ రెడ్డితో మాట్లాడి వెనుకబడిన వర్గాల అవసరాల మాట్లాడతా నన్ను గెలిపించండి. తప్పక నేను మాటిస్తున్నాను అని వాగ్దానం చేశారు. మా నాన్న ఆశయం కోసం పని చేస్తాను అన్నారు.

## చలో ఢిల్లీ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన

## ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



యాదగిరగుట్ట (ప్రశ్న న్యూస్) ఆలేరు నియోజకవర్గంలో తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ ఆధ్వర్యంలో ఆగస్టు 6 ,7 తేదీల్లో పలు బీసీ డిమాండ్ల సాధన కోసమై చేపట్టిన హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమ వాల్ పోస్టర్ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దేవరకొండ నరేష్ చారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసం సురేష్, రాష్ట్ర నాయకుడు వాసం సాంబయ్య, సంజు కుమార్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు కుళ్ళ సతీష్,ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు సంపత్ యాదవ్, ఉమ్మడి వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షులు ఆవునూరి సతీష్ మహిళా నాయకులు చిత్తారి రజిత, శ్రీలత, సాగరిక, ఆలేరు మండల్ బహదూర్ పెట్ గ్రామ ఎక్స్ సర్పంచ్ కూళ్ల నరసింహులు,రాష్ట్ర యూత్ ఇన్చార్జి నాగరాజు చారి శివ కిరణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రశ్న

హైదరాబాద్, సోమవారం 29, జూలై 2024

# అత్తివరద దర్శనం .. 40ఏళ్లకోసారే ఎందుకంటే?



తమిళనాడులోని కాంచీపురం..! ఆలయాల నగరంగా ప్రసిద్ధి పొందిన పుణ్యప్రదేశం. వెయ్యికి పైగా దేవాలయాలున్న ఆధ్యాత్మిక ప్రాంతం. నిత్యం వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. సాధారణంగానే సందడిగా కనిపించే కంచి...ఇప్పుడు మరింత కళ సంతరించుకుంది. భక్తుల సంఖ్య .. వేలు దాటి లక్షలకు చేరింది. కారణం.. దివ్య మంగళ స్వరూపమైన అత్తివరదరాజ స్వామి విగ్రహం...జలం వీడి జనంలోకి రావటమే..! 40 ఏళ్లకోసారి మాత్రమే కనిపించే ఈ అరుదైన దృశ్యం చూసేందుకు... భక్తులు దేశ నలుమూలల నుంచి కంచికి వరస కట్టారు. జీవితంలో ఒక్కసారైనా స్వామివారి తేజోమయమైన రూపం చూడాలని.. వేయి కళ్లతో నిరీక్షించిన వారంతా ఆలయానికి పోటెత్తారు. సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు స్వామివారిని దర్శించుకుని తరించారు.

భక్తులకు వరాలు ఇవ్వడానికి దేవుడు దిగి వచ్చిన కథలు మనం విన్నాం. కానీ ఈయన చాలా ప్రత్యేకం. 40 ఏళ్ల ఎదురు చూపులకు తెర దించాడు. నీటి నుంచి పైకి వచ్చి మరీ అనుగ్రహిస్తున్నాడు. తమిళుల ఆరాధ్య దైవంగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా కాంచీపురంలో కొలువైన వరదరాజ పెరుమాళ్ కథ ఇది.



**అంచనాలకు మించి పోటెత్తిన భక్తజనం :** వైకుంఠనాథుడైన శ్రీ మహావిష్ణువు చిద్విలాస మూర్తిగా వరాలనొసిగే వరదరాజ పెరుమాళ్ల ఆలయం మరోసారి అరుదైన ప్రదర్శనకు వేదికైంది. 40 సంవత్సరాలకు కేవలం 48 రోజులు మాత్రమే దర్శనమిచ్చే అనంతశయన మూర్తి దివ్య మంగళ విగ్రహం అత్తివరదరాజ స్వామిగా భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఈ తొమ్మిది అడుగుల దివ్య స్వరూపం తిలకించేందుకు రోజూ లక్షలాదిమంది తరలి వస్తున్నారు. జులై 1న ప్రారంభమైన అత్తివరదర్ వేడుకలు ఆగస్టు 17న ముగియనున్నాయి.



దేశంలో జరిగే వివిధ ఉత్సవాలకు ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అదే విధంగా ఆలయ కోనేటి గర్భంలో ఉండే స్వామి విగ్రహం 40 ఏళ్ల తర్వాత భక్తులకు దర్శనం ఇవ్వడమనేది అత్తివరదరాజ స్వామి ప్రత్యేకత. స్వామి వారి విగ్రహాన్ని పుష్కరిణి నుంచి బయటకు తీసుకొచ్చి పవళింపు సేవతో ఈ వేడుకలను ప్రారంభించారు. స్వామిని వీక్షించేందుకు దేశదేశాల నుంచి వస్తున్న లక్షలాది భక్తులతో కాంచీపురం భక్తజన క్షేత్రంగా మారింది. నిత్యం దైవస్మరణలో ఉండే ఈ మహా క్షేత్రంలో అనంత పద్మనాభుని దర్శనం ఎంతో పుణ్యమని భక్తుల విశ్వాసం.సినిమా తారలు మొదలుకొని గవర్నర్లు, మంత్రులు, సామాన్య భక్త జనం కాంచీపురానికి పోటెత్తారు. కాంచీపురం చరిత్రలో ఇంతటి పెద్ద జనసందోహం చూసి ఉండరు. ప్రభుత్వ వర్గాలు సైతం ఈ స్థాయిలో భక్తులు వస్తారని ఊహించలేదు. 48 రోజుల వ్యవధి ఉన్న ఉత్సవం కారణంగా సులభంగానే నిర్వహించవచ్చని ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అంచనా వేశాయి. రోజురోజుకీ పెరిగిపోతున్న భక్తుల తాకిడిని చూసి ప్రభుత్వ వర్గాలే ఆశ్చర్యపోతుయాయి. అత్తివరదరాజస్వామిని ఇప్పటి వరకు కోటి మందికి పైగా దర్శించుకున్నారని ప్రభుత్వ అంచనా. 40 సంవత్సరాల తర్వాత కోనేటి నుంచి బయటకు వచ్చిన అత్తివరదరాజస్వామి 31 రోజులు శయన రూపంలోను 17 రోజులు స్థాన మూర్తిగా నిల్చొని దర్శనమిచ్చారు.

**బ్రిటిష్ వారు కూడా ఈయన భక్తులే..** దేశంలోని శ్రీ వైష్ణవ దివ్యక్షేత్రాల్లో కాంచీపురం ఒకటి. అక్కడి వైష్ణవాలయాల్లో ప్రసిద్ధి చెందింది వరదరాజ పెరుమాళ్ ఆలయం. వేఘవతి నది ఒడ్డున కొలువుదీరిన ఈ క్షేత్రానికి సంబంధించి ఎన్నో స్థల పురాణాలు ప్రచారంలో ఉన్నాయి. సాక్షాత్ బ్రహ్మదేవుడే ఈ శ్రీ అత్తి వరదరాజస్వామి విగ్రహాన్ని చెక్కించాడని, అందుకు దేవశిల్పి విశ్వకర్మ సహకరించాడని పురాణాలు చెబుతున్నాయి. అత్తి వరదరాజస్వామిని మహావిష్ణువు అవతారంగా భక్తుల విశ్వసిస్తుంటారు. స్థానికులు వరదరాజ పెరుమాళ్‌గా కొలుస్తుంటారు. ఈ స్వామి వారు...40 ఏళ్లకోసారి మాత్రమే దర్శనమివ్వటం వెనక ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి.దేశంలో మోక్షాన్ని ఇచ్చే నగరాలు ఏడు ఉన్నట్లు పురాణాలు పేర్కొంటాయి. ఆరు మోక్షపురులు ఉత్తర భారత దేశంలోనే ఉన్నాయి. అందులో ఒకే ఒక్క మోక్షపురి దక్షిణ భారతదేశంలో ఉంది. అదే కాంచీపురం. అలాంటి కాంచీపురంలోని ముఖ్యమైన ఆలయాల్లో వరదరాజ్ పెరుమాళ్ల ఆలయం ఒకటి. మూలవిరాట్టు అయిన విష్ణుమూర్తిని వరదరాజ స్వామిగా పిలుస్తారు. స్వామివారి దేవేరి పెరుందేవి. బ్రిటిష్ పాలకులు సైతం వరదరాజస్వామిపై భక్తి ప్రవత్తులు చాటుకున్నారు. బ్రిటిష్ గవర్నర్ జనరల్ రాబర్ట్ క్లైవ్ ఒకసారి అనారోగ్యం బారిన పడగా.. స్వామి వారిని వేడుకున్నాక సాంత్వన పొందారట. ఫలితంగా ఆయన, ఆయన భార్య వరదరాజ స్వామి భక్తులుగా మారి, స్వామివారికి కానుకలు, ఆభరణాలు సమర్పించారట. రాబర్ట్ క్లైవ్ 'మణికంఠిక' పేరుతో ఓ ఆభరణాన్ని ఇప్పటికీ స్వామి వారికి అలంకరిస్తుంటారు. అసలు ఈ అత్తివరదరాజ స్వామి ఎవరు? ఆయన 40 ఏళ్లకు ఒకసారి దర్శనం ఇవ్వడానికి గల కారణాలు ఏంటి? అని ఆరాతీస్తే పలు ఆసక్తి కరమైన విభిన్న కథనాలు స్థానికులు చెప్తారు. వాటిల్లో పురాణ కథనాలతో పాటు, చారిత్రక ఘట్టాలు ఉన్నాయి.

**తొలుత 60ఏళ్లకోసారే అవకాశం..** పురాణ కథనాల ప్రకారం కృతయుగంలో బ్రహ్మదేవుడు కంచిలో అశ్వమేధ యాగం చేశారట. యాగం నిర్విఘ్నంగా జరిగేలా విష్ణుమూర్తి కాపాడట. ఆయనే ప్రస్తుతం ఉన్న మూలవిరాట్టు అత్తివరదరాజ స్వామి పెరుమాళ్. విగ్రహం మొత్తం అత్తి కలపతో తయారు చేయడం వల్ల ఈ స్వామి వారికి అత్తివరదుడు అనే పేరు వచ్చింది. బ్రహ్మదేవుని యజ్ఞకుండం నుంచి కూడా మరో విష్ణుమూర్తి ఉద్భవించారట. ఆ విష్ణుమూర్తి దారు విగ్రహమై యజ్ఞం తాలూకా ఉష్ణ తాపంతో ఉన్నారట. అందుకే అత్తి వరదరాజ స్వామి విగ్రహానికి ఎల్లప్పుడూ పన్నీటి అభిషేకం చేసేవారట. తనలోని ఉష్ణతాపం చల్లార్చేందుకు ఆలయ కోనేరులో ఉంచాల్సిందిగా స్వామివారు అర్చకులకు కలలో వచ్చి చెప్పారని, అందుకే వరదరాజ స్వామిని కోనేటిలో ఉంచుతారని ఒక కథ ప్రచారంలో ఉంది. మొదటి స్వామి వారిని 60 ఏళ్లకొకసారి దర్శనార్థం ఉంచేవారు. కొన్ని శతాబ్దాల పూర్వమే.. 40 సంవత్సరాలకు కుదించారని చెబుతారు. వరదరాజ స్వామి విగ్రహాన్ని అత్తిచెట్టు కాండం నుంచి తయారు చేయటం వల్ల ఆపేరు స్థిరపడిపోయిందనీ అంటుంటారు. అందుకే ఆ విగ్రహం ఎన్నో ఏళ్లు నీటిలో ఉన్నా చెక్కు చెదరదు.

**పెరుమాళ్‌ను మోస్తున్న గజగిరి..** ఈ ఆలయానికి సంబంధించి మరో స్థల పురాణం కూడా ప్రచారంలో ఉంది. బ్రహ్మదేవుడు ఒక యజ్ఞం ప్రారంభించి, ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు స్వామి వారి విగ్రహాన్ని తయారు చేయించి కంచిలో స్వయంగా ప్రతిష్ఠించారని అంటారు. ఈ స్వామి అగ్ని దేవుని స్వరూపం. బయట ఎక్కువ కాలం ఉండలేరు. స్వామికి నిత్యాభిషేకాలు తప్పనిసరి. 9 అడుగులు ఉండే విగ్రహాన్ని మధ్య యుగంలో దాడులు జరుగుతున్న వేళ వెండి పెట్టెలో అమర్చి దేవాలయానికి దగ్గర్లో ఉండే పుష్కరిణిలో దాచిపెట్టాలని నిర్ణయించారు. ఆపై అదే దేవుని శిల్పాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో మూలవిరాట్టు వరదరాజ పెరుమాళ్ పశ్చిమం వైపు, తాయారు పెరుందేవి తూర్పువైపు నిలబడినట్లు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఆలయం ఉన్న కొండ ఏనుగు రూపంలో ఉంటుంది. పెరుమాళ్ మోస్తున్నందున ఈ కొండకు అత్తిగిరి కొండ అనే పేరు కూడా ఉంది. ఈ ఆలయంలో బంగారు, వెండి బల్లులు భక్తులకు దర్శనం ఇస్తున్నాయి. వీటన్నిటికీ మించిన మరో విశిష్టత ఇక్కడ ఉంది. ఆలయ ప్రాంగణంలోని అనంతసరస్సుగా పిలుచుకునే పుష్కరిణిలో మూడు మంటపాలు ఉన్నాయి. ఆరు స్తంభాలు, నాలుగు స్తంభాల మంటపాలతో పాటు శ్రీ కృష్ణుడి దివ్య విగ్రహం ప్రతిష్ఠించిన మంటపాలు ఉన్నాయి. అత్తివరదర్‌గా పిలుస్తున్నవరదరాజ స్వామి విగ్రహాన్ని వెండి పెట్టెలో పెట్టి నాలుగు స్తంభాల మంటపంలో నీటి అడుగు భాగాన భద్రపరిచారు. 40 ఏళ్లకొకసారి పుష్కరిణిలోని నీటిని తోడేసి విగ్రహం ఉన్న పెట్టె బయటకు తీసి విగ్రహాన్ని శుభ్రం చేస్తారు. పూజల తర్వాత ఆ విగ్రహాన్ని వసంత మంటపంలో ఉంచుతారు. 48 రోజుల తర్వాత స్వామి వారి విగ్రహం తిరిగి వెండి పెట్టెలో పెట్టి పుష్కరిణిలోని నాలుగు కాళ్ల మంటపంలో ఉంచి నీటితో నింపేస్తారు.

**మత్స్యావతారం ఎత్తి..సోమకుడిని వధించి** స్వామివారి జలావాసంపై రకరకాల కథనాలు ఉన్నాయి. పూర్వం యుద్ధం జరిగే సమయంలో ఆలయాలకు, దేవతా విగ్రహాలకు తగిన రక్షణ ఉండేది కాదు. ఆలయంలోని మూల విరాట్టును రక్షించుకునేందుకు అర్చకులు ఇలా భూమిలో దాచారని.. ఆపద సమయం ముగిసిన తర్వాత ఆ విగ్రహం బయటకు తీసి పూజించేవారని చెబుతారు. అత్తివరదరాజ స్వామిని భూమిలోపల దాచే సమయంలో ఏర్పడ్డ గుంత పుష్కరిణిగా రూపాంతరం చెందిందని చరిత్ర చెబుతుంది. పురాణాలు మాత్రం యాగగుండం నుంచి అత్తివరదర్ పుట్టినట్లు చెబుతున్నాయి. మత్స్యావతారం ఎత్తి నీటిలో దాగివున్న సోమకుడిని వధించి వేదాలు కాపాడిన విష్ణువు కాంచీపురంలో అత్తివరదరాజ స్వామిగా నీటి కొలనులో విశ్రమిస్తాడని మరో పురాణ ప్రతీతి.

**విష్ణకంచిలో కొలువైన అత్తివరదరాజ స్వామి** వైష్ణవులకు పరమ పవిత్రమైన 108 దివ్య క్షేత్రాల్లో అత్తివరదరాజ స్వామి ఆలయం ఒకటి . శ్రీరంగం, తిరుమల తరువాత కంచి శ్రీ వరద రాజ పెరుమాళ్ కోవెల అత్యంత పవిత్ర దర్శనీయ క్షేత్రం.ఈ 108 దివ్య తిరుపతుల్లో పదునాలుగు కంచిలోనే ఉండటం విశేషం. అందులో కొన్ని విష్ణు కంచిలో ఉండగా మరి కొన్ని శివకంచిలో ఉంటాయి. విష్ణు కంచిలోని ఈ వరద రాజ పెరుమాళ్ కోవెల...ఎంతో విశేష పౌరాణిక, చారిత్రక నేపథ్యం సంతరించుకుంది.

**రామానుజాచార్యుల నివాసమిదే!** వరదరాజ పెరుమాళ్ ఆలయాన్ని హస్తగిరి ఆలయం లేదా అత్తియురాన్ అంటారు. ఈ ఆలయం ఉన్న ప్రదేశాన్ని విష్ణు కంచి అని పిలుస్తారు. ఇక్కడే రామానుజాచార్యులు నివసించారని చెబుతారు. కృతయుగంలో బ్రహ్మ, త్రేతాయుగంలోగజేంద్రుడు, ద్వాపరయుగంలో బృహస్పతి, కలియుగంలో ఆదిశేషుడు, ఆల్వారులు, శ్రీరామానుజాచార్యులు, ఆదిశంకరులు ... ఈ స్వామిని సేవించారని పురాణాలు పేర్కొంటున్నాయి. మొత్తం 25 ఎకరాల్లో ఉండే ఈ ఆలయాన్ని మొదట కంచిని పాలించిన పల్లవ రాజు రెండో నంది వర్మ క్రీ.శ 8వ శతాబ్దంలో నిర్మించినట్లుగా తెలుస్తోంది. తర్వాత చోళరాజులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారని



శాసనాలు తెలియజేస్తున్నాయి. మరెన్నో రాజవంశాలు ఆలయానికి తమ వంతు కర్తవ్యంగా సేవలందించాయి. విజయనగర రాజుల కాలంలోనే ఈ కోవెలలో ఎక్కువ నిర్మాణాలు జరిగి ప్రస్తుత రూపం సంతరించుకుంది. ఎన్నో తెలుగు, తమిళ, కన్నడ శాసనాలు ఇక్కడ కనిపిస్తాయి. మొత్తం మూడు ప్రాకారాలతో 32 ఉపాలయాలతో, 19 విమాన గోపురాలు 300 పై చిలుకు మంటపాలతో శోభాయమానంగా ఉంటుంది. అద్భుతమైన శిల్ప కళ ఈ ఆలయం సొంతం. ముఖ్యంగా అనంత పుష్కరిణి పక్కన ఉండే నూరు స్తంభాల మంటప శిల్ప శోభ వర్ణనాతీతం. ఒకే రాతిపై చెక్కిన గొలుసులు, కూర్మ సింహాసనానికి దిగువన అమర్చిన తిరిగే చక్రాలు, స్తంభాలకు చెక్కిన రామాయణ, మహాభారత సన్నివేశాలు మహాద్భుతంగా ఉంటాయి.

**ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి నీటిలో...** చారిత్రక ఇతివృత్తాన్ని పరిశీలిస్తే 16శతాబ్దంలో ఈ వరద రాజస్వామి ప్రతిమకు గర్భగుడిలోనే పూజలు చేసేవారు. ముస్లిం పాలకులు వరుసపెట్టి కొన్ని ఆలయాల్లోని విగ్రహాలను ధ్వంసం చేయసాగారు. వారి బారి నుంచి కాపాటానికి స్వామివారి అర్చకులు ఆలయ కోనేరు అనంత సరస్పుష్కరిణిలో ఎవరికీ తెలియకుండా భద్రంగా దాచారట. ఆలయ నిర్వాహకులైన ధర్మకర్తలకు సైతం విగ్రహాన్ని ఎక్కడ దాచారో చెప్పలేదట. కొన్నేళ్ల తర్వాత పుష్కరిణిలో విగ్రహం దాచిన అర్చకులు మరణించారు. ముప్పు తొలగిన తర్వాత అప్పటి ఆలయ అర్చకులకు విగ్రహం దొరకలేదు. అందుకని గర్భగుడిలో మరో విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఆయనే ప్రస్తుత మూలవిరాట్ వరదరాజ స్వామి. స్వామి వారి దేవేరి పేరు పెరుందేవి. అంటే మహాలక్ష్మి అని అర్థం. ఆలయ కోనేరు పేరు అనంత సరస్. ఇది జీవ పుష్కరిణి. ఎప్పుడూ నీటితో కళకళాడుతూ ఉంటుంది. ఆలయ పుష్కరిణిలో నాలుగు కాళ్ల మండపం ఉంటుంది. మండపం కింద భాగంలో బిలం వంటి ప్రదేశంలో అత్తి వరదరాజ స్వామి 40 ఏళ్ల పాటు జలవాసం చేస్తారు. ఒకానొక సందర్భంగా నీరు పూర్తిగా ఇంకిపోయిందట. అప్పుడే కోనేటి గర్భంలో ఉన్న విగ్రహం బయటపడిందట. ఒకే ఆలయంలో ఇద్దరు మూలవిరాట్‌లు ఉండటం ఆగమశాస్త్రం ప్రకారం నిషిద్ధమట. అందుకే 40 ఏళ్లకోసారి కోనేటి నుంచి తీసి 48రోజుల పాటు భక్తుల సందర్శనార్థం బయటకు తీసే సంప్రదాయం మొదలైంది. అత్తి వరదరాజ స్వామిని 1783లో కోనేటి నుంచి వెలికి తీసినట్లు ఆలయంలో ఉన్న తెలుగు శాసనం చెబుతోంది. 40 ఏళ్లకోసారి దర్శనం ఏర్పాటు చేసే సంప్రదాయం 1854 నుంచి కొనసాగుతున్నట్లు అప్పటి వార్తా పత్రికల కథనాల ఆధారంగా తెలుస్తోంది. 1892, 1937, 1979 తర్వాత ఈ ఏడాదిలో మళ్లీ ఈ మహా క్రతువును నిర్వహించారు. 1977-78లో రాజగోపురం నిర్మాణ పనుల వల్ల ఈ క్రతువు రెండేళ్లు ఆలస్యమైంది. ఈ గుడికి సంబంధించి 362 రాత ప్రతులు లభించాయి. ఇందులో కొన్ని కాకతీయులు, తెలుగు చోళులకు చెందినవి కూడా ఉన్నాయి.

**దర్శనంపై కోర్టులో కేసులు......** శయన మూర్తిగా ఉన్న స్వామి యోగమూర్తిగా జ్ఞానం ప్రసాదిస్తారని, నిలువు మూర్తిగా భక్తుల కోర్కెలు తీరుస్తారని భావిస్తారు. అందుకే శయన మూర్తిగా ఉన్న స్వామివారిని రోజుకు లక్షమందికిపైగా దర్శించుకుంటారు. నిలువు మూర్తిగా దర్శనానికి ఉంచిన సమయంలో వారి సంఖ్య దాదాపు రెట్టింపయ్యింది. అత్తి వరదరాజ స్వామి దర్శనానికి సంబంధించి మద్రాసు హైకోర్టులో పలు దావాలు కూడా వేశారు. విదేశీ పాలకుల నుంచి కాపాడేందుకు స్వామి వారిని పుష్కరిణిలో దాచారని, ఇప్పుడు అలాంటి ప్రమాదం ఏమీ లేనందున 365 రోజులు స్వామి వారిని దర్శనానికి ఉంచాలని పిటిషన్ వేశారు.

కేవలం 48 రోజులు సరిపోవని మరో 10 రోజులు పెంచాలని ఇంకో పిటిషన్ వేశారు. మతాచాచరాల విషయంలో జోక్యం తగదని, ప్రస్తుత సంప్రదాయాన్నే కొనసాగించాలని మద్రాసు హైకోర్టు అన్ని పిటిషన్లనూ తోసిపుచ్చింది. మళ్లీ స్వామివారిని దర్శించుకోవాలంటే 2059లోనే సాధ్యం.





# ముప్పు ముంగిట వన్యప్రాణులు



వన్యప్రాణులు ముప్పు ముంగిట మనుగడ సాగిస్తున్నాయి. వాటికి సహజ ఆవాసాలైన అడవులను స్వార్థపరులైన మనుషులు ఆక్రమించుకుంటూ ఉండటంతో అవి ఆవాసాన్నే కాదు, అర్ధంతరంగా ఆయువునూ కోల్పోతున్నాయి. గడచిన యాభయ్యేళ్ల కాలంలో భూమ్మీద మనుషుల జనాభా రెట్టింపును మించి పెరిగింది. ఇదే కాలంలో వన్యప్రాణుల జనాభా మూడింట రెండు వంతులకు పైగా తగ్గిపోయింది. కొన్ని జాతుల వన్యప్రాణులు పూర్తిగా కనుమరుగైపోయాయి. ఇంకొన్ని అంతరించిపోయే దశలోకి చేరుకున్నాయి. ఇదే రీతిలో వన్యప్రాణులు మరింతగా కనుమరుగైతే, పర్యావరణ సమతుల్యత దారుణంగా దెబ్బతిని, ఆ పరిస్థితి మనుషుల మనుగడకే ముప్పుగా మారే ప్రమాదం లేకపోలేదు.

వన్యప్రాణుల మనుగడకు సంబంధించి ఇటీవల విడుదలైన 'లివింగ్ ప్లానెట్ ఇండెక్స్' నివేదిక ఆందోళన కలిగించేదిగా ఉంది. వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఇంటర్నేషనల్, జువాలాజికల్ సొసైటీ ఆఫ్ లండన్ సహకారంతో 'లివింగ్ ప్లానెట్ ఇండెక్స్'%--%2020 తన నివేదికను రూపొందించింది. భూగోళంపై నివసించే సమస్త వన్యప్రాణులనూ ఇందులో లెక్కలోకి తీసుకోకపోయినా, వెన్నెముక గల 4000 వేల వన్యజంతువుల జాతులను పరిగణనలోకి తీసుకుంది. వీటి సంఖ్య 1970 నాటితో పోల్చితే 2016 నాటికి సగటున 68 శాతం మేరకు తగ్గిపోయింది. వ్యవసాయ విస్తరణ, అడవుల నరికివేత పెరగడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తినట్లు 'లివింగ్ ప్లానెట్ ఇండెక్స్' వెల్లడించింది. కోట్లాది సంవత్సరాలుగా భూమిపై మనుగడ సాగిస్తున్న వన్యజీవులు కేవలం అర్ధశతాబ్ది వ్యవధిలోనే ఈ స్థాయిలో తగ్గిపోవడమంటే, ఈ పరిణామాన్ని రెప్పపాటు కాలంలో సంభవించిన మార్పుగా పరిగణించాలని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్ మార్కో లాంబెర్టిని అభిప్రాయపడ్డారు.

**బార్బరీ లయన్, బాక్ట్రియన్ ఒంటె**

**ఎందుకు ఈ పరిస్థితి..?** గడచిన అర్ధశతాబ్ది కాలం లోనే వన్యప్రాణుల సంఖ్య ఇంత దారుణంగా తగ్గిపోవడానికి కారణాలు చాలానే ఉన్నాయి. ఇదే కాలంలో మనుషుల జనాభా రెట్టింపును మించి పెరిగింది. మనుషుల వినిమయం అంతకు మించి పెరిగింది. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇంటర్నేషనల్ చెబుతున్న ప్రకారం%--% భూమికి గల తన సహజ వనరుల పునరుత్పాదక శక్తితో పోలిస్తే, 1970 సంవత్సరానికి ముందు వరకు మానవుల పర్యావరణ అడుగుజాడలు తక్కువగానే ఉండేవి. అందువల్ల మనుషులు అటవీ సంపదను వాడుకుంటూ వచ్చినా, అప్పట్లో అంతగా ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడైతే మనుషులు భూమికి గల సహజ వనరుల పునరుత్పాదన సామర్థ్యానికి మించి ఒకటిన్నర రెట్లు ఎక్కువగా సహజ వనరులను ఇష్టానుసారం వాడేసుకుంటున్నారు.

గడచిన యాభై ఏళ్లలో భారీగా పెరిగిన పరిశ్రమలు అడవులను, గడ్డిభూములను వ్యవసాయ క్షేత్రాలుగా మార్చేయడం గణనీయంగా పెరిగింది. దీనికి తోడు పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం, తరచుగా అడవుల్లో చెలరేగుతున్న కార్చిచ్చులు వన్యప్రాణులను వేగంగా హరించేస్తున్నాయి. ప్రస్తుతం భూమిపైనున్న స్థలభాగంలో మూడోవంతు, మంచినీటి వనరుల్లో నాలుగింట మూడువంతులు కేవలం ఆహార ఉత్పాదన కోసమే వినియోగమవుతున్నాయి. మనుషులు మనుగడ సాగిస్తున్న భూమిపై ఈ పరిస్థితి ఉంటే, సముద్రాల పరిస్థితి మరీ దారుణంగా మారింది. సముద్రాల్లోని మత్స్యవనరులను మనుషులు వినియోగించుకోవాల్సిన దాని కంటే 75 శాతం అదనంగా వినియోగించుకుంటున్నారు.

**కరీబియన్ మాంక్ సీల్, టాస్మానియన్ టైగర్**

కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణం భూమిపైనున్న వన్యప్రాణులు కొన్ని ప్రాంతాల్లో మరింత వేగంగా కనుమరుగైపోతున్నాయి. ముఖ్యంగా మధ్య అమెరికా, దక్షిణ అమెరికా ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఈ ప్రాంతాల్లో గడచిన యాభై ఏళ్లలో వన్యప్రాణుల సంఖ్య ఏకంగా 94 శాతం మేరకు తగ్గిపోయింది. ఇలాంటి పరిణామం కచ్చితంగా మన ప్రపంచంపై ప్రభావం చూపుతుందని లాంబెర్టిని హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న నలభై స్వచ్ఛంద సంస్థలు, విద్యా పరిశోధన సంస్థలు వేర్వేరుగా జరిపిన అధ్యయనాల్లోని సమాచారాన్ని క్రోడీకరించుకుని, 'లివింగ్ ప్లానెట్' తన నివేదికలోని సమాచారాన్ని సవరించుకుని, ఇటీవలే దానిని విడుదల చేసింది. ఈ నివేదికను 'ద నేచర్' జర్నల్ ప్రచురించింది. ఇందులో వన్యప్రాణుల పరిరక్షణ కోసం ప్రపంచ దేశాలన్నీ తక్షణమే చేపట్టవలసిన చర్యలను కూడా సూచించింది. "ఈ పరిస్థితిపై మనం తక్షణమే స్పందించాలి. జీవ వైవిధ్యం నాశనమవుతున్న వేగంతో పోల్చుకుంటే, ప్రభుత్వాలు చేపడుతున్న చర్యల వల్ల మొదలైన జీవ వైవిధ్య పునరుద్ధరణ వేగం చాలా తక్కువగా ఉంటోంది. ఇక ఏమాత్రం జాప్యం చేసినా మానవాళి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. జీవ వైవిధ్యాన్ని తిరిగి యథాస్థితికి తీసుకురావాలంటే కొన్ని దశాబ్దాల కాలం పట్టవచ్చు" అని 'లివింగ్ ప్లానెట్' అధ్యయనంలో పాల్గొన్న పరిశోధకుడు డేవిడ్ లీక్లీర్ ఆందోళన వ్యక్తం చేశారు.

**వేటాడి చంపేస్తున్నారు** అరుదైన వన్యప్రాణులను సైతం వేటగాళ్లు వేటాడి చంపేస్తున్నారు. ఇదివరకటితో పోలిస్తే, మాంసం కోసం వన్యప్రాణుల వేట గత యాభయ్యేళ్లలో గణనీయంగా పెరిగింది. సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా 60 లక్షల టన్నుల వన్యప్రాణుల మాంసం అక్రమ మార్కెట్లకు తరలుతోంది. కేవలం బ్రెజిల్‌లోని అమెజాన్ అడవుల నుంచి 2 వేల కోట్ల డాలర్ల (రూ. 1.47 లక్షల కోట్లు) విలువ చేసే వన్యప్రాణుల మాంసం ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి అవుతోంది. వ్యక్తిగత లగేజీల్లో దాచి ఇలా తరలిస్తుండగా పారిస్ ఎయిర్‌పోర్టులో ఏటా పట్టుబడే వన్యప్రాణుల మాంసం 260 టన్నుల వరకు ఉంటోంది. ఇక మిగిలిన అంతర్జాతీయ విమానాశ్రయాలకు, నౌకాశ్రయాలకు చేరుతున్న మాంసం ఏ పరిమాణంలో ఉంటుందో ఊహించుకోవాల్సిందే!

**ఇవి ఇప్పటికే అంతరించాయి** అడవుల నరికివేత, కార్చిచ్చులు, కాలుష్యం, వేట తదితర కారణాల వల్ల ఇప్పటికే చాలా వన్యప్రాణులు పూర్తిగా కనుమరుగై పోయాయి. గడచిన వందేళ్లలో దాదాపు 500 జాతులకు చెందిన జంతువులు, పక్షులు అంతరించిపోయాయి. గోల్డెన్ టోడ్ (బంగారు వన్నె కప్ప), రామచిలుకల జాతికి చెందిన కరోలినా పారాకీట్, కోడి జాతికి చెందిన హీత్ హెన్, కంగారు తరహా జాతికి చెందిన టాస్మానియన్ టైగర్, పెద్దపులుల్లో ఒక జాతి అయిన కాస్పియన్ టైగర్, కరీబియన్ మాంక్ సీల్, ఖడ్గమృగం జాతికి చెందిన వెస్టర్న్ బ్లాక్ రినో, పింటా ఐలాండ్ తాబేలు, సింహాల జాతిలో అరుదైన బార్బరీ లయన్, షోంబర్క్ జింకలు వంటివి గత వందేళ్లలోనే ఉనికిలో లేకుండా పోయాయి.

**క్లౌడెడ్ చిరుతపులి, పంగోలిన్** భారత్‌లో వన్యప్రాణుల పరిస్థితిగడచిన శతాబ్ద కాలంలో మన భారత్‌లో కూడా కొన్ని జంతువులు పూర్తిగా కనుమరుగైపోయాయి. వాటిలో చిరుత జాతికి చెందిన ఇండియన్ చీతా, అడవి దున్నల జాతికి చెందిన ఇండియన్ అరోక్, సుమత్రా ఖడ్గమృగాలు, శివాతెరియం (దీనిని శివుడి వాహనంగా భావించేవారు) వంటి భారీ జంతువులు సైతం అంతరించిపోయాయి. భారత్‌లో నెలకొన్న పరిస్థితులు వన్యప్రాణుల మనుగడకు నానాటికీ ప్రమాదకరంగా మారుతున్నాయి. వన్యప్రాణుల పరిరక్షణ కోసం ప్రభుత్వం 1972లో వన్యప్రాణుల పరిరక్షణ చట్టాన్ని అమలులోకి తెచ్చినా, మాంసం కోసం, జంతు శరీర భాగాల కోసం వన్యప్రాణుల వేట జరుగుతూనే ఉంది. చట్ట ప్రకారం వన్యప్రాణుల వేట, తరలింపు వంటి చర్యలను శిక్షార్హమైన నేరాలుగా పరిగణిస్తున్నా, వేటగాళ్లు వీటిని బేఖాతరు చేస్తూ, యధేచ్ఛగా వన్యప్రాణులకు ముప్పు తెచ్చిపెడుతున్నారు. జీవవైవిధ్యం గల దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచంలోని 6.5 శాతం వన్యప్రాణులు భారత్‌లోనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా గల స్తన్యజీవుల్లో 7.6 శాతం, పక్షిజాతుల్లో 12.6 శాతం భారత్‌లో కనిపిస్తాయి. భారత్‌లో ఎక్కువగా వేటగాళ్ల బారిన పడుతున్న వాటిలో పెద్దపులులు, ఖడ్గమృగాలు, ఏనుగులు, నక్షత్ర తాబేళ్లు వంటివి ఉంటున్నాయి. చర్మం కోసం, పంజా, గోర్లు, ఇతర శరీర భాగాల కోసం వేటగాళ్లు పెద్దపులులను వేటాడుతున్నారు. చైనీస్ సంప్రదాయ వైద్యంలో పెద్దపులి శరీర భాగాలకు విపరీతమైన గిరాకీ ఉంది. దంతాల కోసం ఏనుగులను, కొమ్ముల కోసం ఖడ్గమృగాలను పొట్టన పెట్టుకుంటున్నారు. వీటిని గృహాలంకరణలుగా వాడటంపై రకరకాల నమ్మకాలు ప్రచారం ఉండటంతో వీటికీ గిరాకీ ఎక్కువగానే ఉంటోంది. ఫెంగ్‌షుయి నమ్మకాల కారణంగా కొన్ని దేశాల్లో నక్షత్ర తాబేళ్లను పెంచుకుంటున్నారు. సాధారణంగా వీటిని సజీవంగానే విదేశాలకు తరలిస్తుంటారు చైనా, మలేసియా, ఇండోనేసియా వంటి దేశాల్లో పులులు, ఖడ్గమృగాల శరీర భాగాలకు విపరీతమైన గిరాకీ ఉండటంతో అక్రమ మార్గాల గుండా వీటిని తరలిస్తున్నారు. ఇదివరకటి కాలంలో అడవి జంతువుల వేట కోసం వేటగాళ్లు ఉచ్చులు, మామూలు తుపాకులు ఎక్కువగా వాడేవారు. ఇటీవలి కాలంలో భారీ జంతువులను వేటాడటానికి అధునాతనమైన తుపాకులతో పాటు కొందరు పశు వైద్యులు జంతువులకు శస్త్రచికిత్సలు చేసేటప్పుడు వాడే మత్తుమందులు, విషం సైతం వినియోగించి, జంతువులను మట్టుబెడుతున్నారని 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ ది కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) వెల్లడించింది. భారతీయ ఖడ్గమృగాలు (ఇండియన్ రినో) ఒకప్పుడు పాకిస్తాన్, భారత్, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్ భూభాగాల్లో విరివిగా కనిపించేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 2,500 లోపే ఉండటంతో అతి అరుదుగా మాత్రమే కనిపిస్తున్నాయి

# బెంగ తీర్చే..వంగ పంట!

- కూరగాయ పంటతో అధిక లాభాలు
- చీడపీడలు తట్టుకునేలా సరికొత్త వంగడాలు



'వంగ' సాగుతో.. అన్నదాత 'బెంగ' తీరుతున్నది. కూరగాయల్లో రారాజుగా వెలుగొందే వంకాయ.. తనను పండించే రైతును కూడా రాజుగా మారుస్తున్నది. దీర్ఘకాలిక/ స్వల్పకాలిక పంటగా సాగవుతూ.. అన్నదాతకు అధిక ఆదాయాన్ని అందిస్తున్నది. చీడపీడలు తట్టుకునేలా సరికొత్త వంగడాలు మార్కెట్లోకి వస్తుండగా, రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతున్నది.

వంగసాగును రైతులు దీర్ఘకాలిక పంటగా, స్వల్పకాలిక పంటగానూ సాగు చేయవచ్చు. దీర్ఘకాలిక పంట 7-8 నెలల వరకు ఉంటుంది. తెగుళ్లు, చీడపీడలు ఆశించకుండా ఉన్నప్పుడు మాత్రమే దీర్ఘకాలిక పంటకు వెళ్లడం మంచిది. లేకపోతే వ్యయం పెరిగి లాభాలు తగ్గే ప్రమాదం ఉన్నది. వంకాయల్లో తెల్ల వంకాయలు, చిన్న వంకాయలు, పొడుగు వంకాయలు, ఎర్ర వంకాయలు, గుత్తి వంకాయలు ప్రధాన రకాలు.

**అనుకూల నేలలు, వాతావరణం :** చలికాలంలో వంగసాగును చేపట్టాలనుకొనే రైతులు.. నవంబర్ నుంచి డిసెంబర్‌లో నారు పోసుకోవాలి. వేసవిలో సాగుకోసం ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారంలో నాటుకుంటే మంచిది. సారవంతమైన నేలలు, నీరు బాగా ఇంకే నేలలు వంగ సాగుకు అనుకూలం. అయితే, చౌడు నేలల్లో వంకాయలను సాగు చేయకపోవడమే మంచిది. నేలలో పోషకాల శాతం ఎక్కువగా ఉంటేనే ఏ పంట అయినా అధిక దిగుబడులను అందిస్తుంది. కాబట్టి, పంట వేయడానికి ముందే భూమిని పోషకాలతో బలంగా తయారు చేసుకోవాలి. భూమిని 2-3 సార్లు ట్రాక్టర్ కల్టివేటర్‌తో దున్నుకోవాలి. ఇలా చేయడం వల్ల నేల వదులుగా తయారవుతుంది. కలుపు మొక్కల విత్తనం కూడా నాశనం అవుతుంది. నేలను వదులుగా దున్నడం వల్ల వేర్లు సులువుగా నేలలోకి చొచ్చుకొని వెళ్లి మొక్క బలంగా తయారవుతుంది. చివరి దుక్కిలో 8 టన్నుల పశువుల ఎరువు, 25 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం వేసుకొని.. నేల మొత్తాన్ని కలియ దున్నుకోవాలి. ఎండు తెగులు నివారణకు మొదట్లోనే ఎకరం పొలానికి 6 కిలోల బ్లీచింగ్ పౌడర్ చల్లుకోవాలి. మొక్కల పెరుగుదలకు 13 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 20 డిగ్రీల సెంటిగ్రేడ్ మధ్య సగటు ఉష్ణోగ్రతలు అవసరం. వంకాయ విత్తనాలు 25 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద బాగా మొలకెత్తుతాయి.

**వంగలో రకాలు :** వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా ప్రస్తుతం మార్కెట్‌లో అనేక రకాల వంకాయలు కనిపిస్తున్నాయి. అయితే, ప్రధానంగా భాగ్యమతి, శ్యామల, పూస పర్పుల్ క్లస్టర్, పూస పర్పుల్ లాంగ్, పూస క్రాంతి వంటివి మన ప్రాంతంలో సాగుకు అనుకూలంగా ఉంటాయి.

భాగ్యమతి : ఈ రకం పంట కాలం 150-165 రోజులు. ఎకరానికి 12-14 టన్నుల దిగుబడి వస్తుంది.

శ్యామల : ఈ రకం పంట 130-150 రోజుల్లో చేతికి వస్తుంది. ఎకరానికి దిగుబడి 7-9 టన్నుల వరకూ ఇస్తుంది.

పూస పర్పుల్ క్లస్టర్ : దీని పంట కాలం 135-145 రోజులు. ఎకరానికి 13-16 టన్నుల దిగుబడి పొందవచ్చు.

పూస పర్పుల్ లాంగ్ : ఈ రకం పంట 135-145 రోజుల్లో కాతకు వస్తుంది. ఎకరానికి 13-16 టన్నుల వరకూ దిగుబడి ఉంటుంది.

పూస క్రాంతి : ఈ రకం పంట కాలం 135-150 రోజులు. ఎకరానికి దిగుబడి 14-16 టన్నుల వరకూ ఉంటుంది.

**వంగలో ఉపజాతులు :** ముండ్ల వంగ : ఈ రకానికి నీరు పెట్టకుండానే వర్షాధారంగా సాగు చేయవచ్చు. తక్కువ తేమతో మొక్కలు పెరుగుతాయి. ఈ రకంలో ఆకుల దగ్గర, కాయ తొడిమల దగ్గర, పుష్పకోశాలపైనా ముండ్లు ఉంటాయి. కాయ గుండ్రంగా ఉంటుంది. నారు పెద్దగా ఎదిగి ఒక్కోసారి కిలో వరకూ తూగే కాయలు కాస్తాయి. కొన్ని కాయలపై చారలు కానీ, మచ్చలు కానీ ఉంటాయి. మిగతా వాటితో పోలిస్తే.. ముండ్ల వంగ రుచిగా ఉంటుంది., అందుకే, ఈ రకం చాలా ప్రసిద్ధి పొందింది.

**ఆత్రేయపురం వంగ :** ఆత్రేయపురం వంగ పొడవుగా, సన్నగా ఉండే కాయలను కాస్తుంది. ఇది కూడా మెట్ట ప్రాంతంలో పండించే రకం. దీనికి ముండ్లు ఉండవు. తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం ప్రాంతంలో ఎక్కువగా పండుతుంది. అందుకే, దీనికి ఈ పేరు. పచ్చి కాయలు ఆకుపచ్చగా, చారలు కలిగి ఉంటాయి. ఇది వర్షాకాలం తర్వాత సాగు చేసే రకం.

**నీటి వంగ :** ఈ రకం చలికాలంలో సాగుకు అనుకూలం. ఇది ముండ్లు లేని రకం. ఈ కాయలు సుమారు అంగుళం లావు, 25 సెం.మీ. నుంచి 30 సెం.మీ. వరకు పొడవు పెరుగుతాయి. కాయలు ఉదారంగులో, రుచికరంగా ఉంటాయి.

**గుత్తివంకాయ :** ఈ రకం వంకాయలు చిన్నగా ఉండి, గుత్తులుగా కాస్తాయి. రెండుమూడు కాయలు ఒక గెలగా ఉంటాయి. అయితే, దిగుబడి తక్కువగా ఉండటం వల్ల దీన్ని పెద్దగా సాగు చేయడం లేదు. అయితే, మార్కెట్‌లో దీనికి డిమాండ్ మాత్రం ఎక్కువగా ఉంటుంది.

**పోచవారి రకం :** పోచవారి రకం గుండ్రటి కాయలు కలిగి ఉంటాయి. దొడ్లలోనూ, పెరట్లోనూ పెంచుకోవడానికి బాగుంటాయి. ఈ రకాలకు విదేశాల్లో భారీ డిమాండ్ ఉంటుంది. విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉన్నవారు.. ఈ రకాన్ని సాగు చేసుకుంటే మంచిది.

**నారు నాటే విధానం :** వంగనారులో పొడవుగా, నిటారుగా పెరిగే (పూసా పర్పుల్ లాంగ్, పూసా పర్పుల్ క్లస్టర్, పూసా పర్పుల్ రౌండ్, భాగ్యమతి, శ్యామల) రకాలను 60/60 సెం.మీ., గుబురుగా పెరిగే (పూసా క్రాంతి, ఆర్క కుసుమాకర్, గులాబీ) రకాలను 75/50 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు ఉండే ప్రాంతాల్లో ఎకరానికి 200 కిలోల వేప పిండి, 6 కిలోల బ్లీచింగ్ పొడిని వేసుకోవాలి. నారు నాటేముందు ఎకరానికి 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలను వేసుకోవడం వల్ల రసం పీల్చే పురుగులను నివారించవచ్చు. డ్రిప్ పద్ధతిలో సాగు చేయాలనుకునే రైతులు మొక్కలు నాటుకునే సాళ్లను కొంచెం ఎత్తు వరకూ చేసుకొని, మల్చింగ్ కవర్ వేసుకోవాలి. దీనివల్ల కలుపు నివారణ, సాగునీరు వృథా కాకుండా అడ్డుకోవచ్చు. పోషక ఎరువులను డ్రిప్ ద్వారా అందించవచ్చు.

**నీటి సరఫరా :** వంగ మొక్కలు నాటే ముందు, నాటిన తర్వాత నారుకు నీరు పెట్టాలి. భూమిలో తేమశాతాన్ని బట్టి చలికాలంలో 7 నుంచి 10 రోజులకు ఒకసారి, వేసవిలో 4 నుంచి 5 రోజులకు ఒకసారి, వర్షకాలంలో అవసరాన్ని బట్టి నీరు పెట్టాలి. కాయలు కోయడానికి 1-2 రోజుల ముందు వరకూ నీటి తడులు పెట్టాలి. లేకుంటే వంకాయలు చేదుగా తయారవుతాయి.

**చీడపీడలు :** ఎన్ని రకాల సరికొత్త వంగడాలను సృష్టిస్తున్నప్పటికీ.. వంగతోటలకు చీడపీడల బెడద ఎక్కువగానే ఉంటుంది. ప్రధానంగా కాయ తొలుచు పురుగు, కాండం తొలుచు పురుగు వంటి చీడపీడలు సోకుతాయి. సరైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలతో చీడపీడలను నివారించుకోవచ్చు.

కాయతొలుచు పురుగు : ఈ పురుగు వల్ల 11 నుంచి 93 శాతం పంటకు నష్టం కలుగుతుంది. నివారణకు లీటర్ నీటిలో 2 మి.లీ ప్రొఫెనోఫాస్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

అక్షింతల పురుగు : ఈ పురుగు వ్యాపించినప్పుడు చేనులో ఉల్లి పాషాణం గానీ, ఖటిక పాషణం గానీ చల్లుకోవాలి. పురుగు నివారణకు మలాథియాన్ (0.16 శాతం) మందును పిచికారీ చేయాలి.

ఎండుతెగులు నివారణ : ఎర పంటగా 4-6 సాళ్ల మధ్య బంతి మొక్కలు నాటుకోవాలి. క్యాబేజీతో పంట మార్పిడి చేసుకున్నా.. ఎండు తెగులును నివారించవచ్చు.

**సాగు విధానం :** విత్తనాలను 50 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండే నీటిలో 30 నిమిషాల పాటు నానబెట్టి, ఆ తర్వాత నీడలో ఆరనివ్వాలి. ఆ తర్వాత కిలో విత్తనానికి 3 గ్రా. చొప్పున థైరమ్ లేదా మాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. 260 గ్రా. విత్తనాన్ని 10 సెం.మీ వరుసలో విత్తుకోవాలి. నారుకుళ్లు నివారణకు లీటర్ నీటిలో 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపి వారం రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు నారుమడిని బాగా తడుపుతూ ఉండాలి. మొక్కల ఎదుగుదలకు ఎకరానికి 2 నుంచి 3 కిలోల చొప్పున ట్రైకోడెర్మా విరిడి కల్చర్‌ను దుక్కిలో వాడాలి. ఒక కిలో ట్రైకోడెర్మా విరిడి కల్చర్‌ను 10 కిలోల వేపపిండి, 90 కిలోల పశువుల ఎరువుతో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని 10 నుంచి 15 రోజులపాటు నీడలో ఉంచి.. అప్పుడప్పుడూ నీరు చల్లుతూ ఉంటే శిలీంధ్రం బాగా అభివృద్ధి చెందుతుంది. దీనిని దుక్కిలో వేసుకుంటే.. ఎండు, వేరుకుళ్లు తెగుళ్లను నివారించవచ్చు.

**సస్యరక్షణ :**పంట పెరిగే దశలో.. మొక్కకు రెండు చొప్పున అల్లిక రెక్కల పురుగులను విడిచిపెట్టాలి. ఎకరానికి నాలుగు చొప్పున లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. తలనత్త ఆశించిన కొమ్మలను పురుగు ఆశించిన ప్రాంతం నుంచి ఒక అంగుళం కిందికి తీసివేయాలి.

# జీ9 అరటికి 'పనామా'ముప్పు!





అరటి సాగుకు 'పనామా తెగులు' గొడ్డలిపెట్టుగా మారింది. మట్టి ద్వారా వ్యాపించే ఈ శిలీంధ్రపు తెగులు అరటి పంటను ప్రపంచవ్యాప్తంగా తుడిచి పెట్టేస్తోంది. పనామా తెగులులో ఒక రకం (టిఆర్1) మన అమృతపాణి అరటి రకాన్ని ఇప్పటికే తుడిచి పెట్టేసింది. ఇప్పుడు గ్రాండ్ నైన్ (జీ9) వంతు వచ్చింది. మూడేళ్లుగా బీహార్, మరో మూడు రాష్ట్రాల్లో పనామా తెగులు మరో రకం (టిఆర్4) జీ9 అరటి తోటలను తీవ్రంగా నష్టపరుస్తోంది. ఇటీవలే శాస్త్రవేత్తలు జీవ శిలీంధ్రనాశినిని తయారు చేశారు. అయినప్పటికీ మన రాష్ట్రాల్లోకి ఇది రాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని, బీహార్ నుంచి కంద పిలకలు తెచ్చుకోవటం మానుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం రైతులకు సూచిస్తోంది. ప్రాచీన కాలం నుంచి మన దేశంలో విరివిగా పండిస్తున్న సాంప్రదాయ పరంగా ప్రాముఖ్యత కలిగిన పండ్లతోట అరటి. అరటిని పండించే దేశాల్లో మన దేశం ముందుండడమే కాకుండా ఇంచుమించు 30 శాతం ప్రపంచ అరటి ఉత్పత్తిని కలిగి ఉంటుంది. మన దేశ అరటి సుమారు 884 వేల హెక్టార్లలో సాగు చేయబడుతూ, 30 మిలియన్ టన్నుల దిగుబడిని కలిగి ఉంటుంది. దేశంలో అరటిని సాగుచేసే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైనది. మన రాష్ట్రంలో సుమారు లక్ష హెక్టార్లలో సాగు చేయబడుతూ, 5 మిలియన్ మెట్రిక్ టన్నుల దిగుబడిని కలిగి ఉంది. ఉభయ గోదావరి, ఇతర కోస్తా జిల్లాలతో పాటు, ఆధునిక సేద్య విధానంతో ఈ మధ్య కాలంలో రాయలసీమలోని కడప, అనంతపురం జిల్లాల్లో ఈ పంటను ఎక్కువగా సాగు చేసి అధిక దిగుబడులను రైతులు సాధిస్తున్నారు. భారతదేశంలో సుమారు 20 అరటి రకాలు సాగులో ఉన్నాయి. మన రాష్ట్రంలో ప్రధానంగా సాగులో ఉన్న అరటి రకాలు కావెండిష్ (గ్రాండ్‌నైన్), అమృతపాణి, తెల్ల చక్కెరకేళి, కర్పూర చక్కెరకేళి, సుగంధాలు, కూర రకాలైన కొవ్వూరు బొంత. అరటిలో దిగుబడులు తగ్గిపోవడానికి ప్రధానమైన కారణం అరటిని ఆశిస్తున్న తెగుళ్లు. వీటిలో ముఖ్యమైనది పనామా/ ఫ్యుజేరియం తెగులు (రేస్%--%1). ఈ తెగులును ఫ్యుజేరియం ఆక్సీస్పోరమ్ ఫార్మాస్పీసిస్ కుబెన్స్ అనే నేలలో నివసించే శిలీంధ్రం కలుగజేస్తుంది. ఈ రేస్%--%1 పనామా తెగులు వల్ల మన రాష్ట్ర రైతులు ఇష్టంగా సాగుచేసే అమృతపాణి రకం తుడిచిపెట్టుకుపోయింది/ సాగులో లేకుండా పోయింది. రైతులు ఇతర రకాలైన గ్రాండ్‌నైన్, తెల్ల చక్కెరకేళి, కర్పూర చక్కెరకేళి, మార్టమాన్ వంటి రకాలను సాగుచేస్తున్నారు. ఈ మధ్యకాలంలో దేశంలోని అరటి పంటను నష్టపరుస్తున్న సమస్య: ట్రోపికల్ రేస్ 4 (టీఆర్ 4) వల్ల కలిగే పనామా/ ఫ్యుజేరియం తెగులు. ఈ తెగులు గ్రాండ్‌నైన్ రకాన్ని ఎక్కువగా ఆశించి నష్టపరచడమే కాకుండా ఇతర రకాలైన అమృతపాణి, కూర అరటిని కూడా ఆశిస్తుంది. పనామా తెగులును కలిగించే ఫ్యుజేరియం శిలీంధ్రంలో నాలుగు రకాల రేస్‌లు ఉన్నాయి. ఇందులో మూడు రకాలు అరటిని ఆశించి నష్టపరుస్తాయి. రేస్-1 అనేది అమృతపాణి వంటి అరటి రకాలను ఆశిస్తుంది. రేస్-2 కూర అరటిని ఆశిస్తుంది. రేస్-3 హెలికోనియా పుష్పాలను ఆశిస్తుంది. రేస్-4 గ్రాండ్‌నైన్ రకాలతో పాటు పైన వివరించిన అమృతపాణి, కూర రకాలను కూడా ఆశించి ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తుంది. దేశవ్యాప్తంగా పండించే అరటి రకాల్లో ఈ గ్రాండ్‌నైన్ రకం 55 నుంచి 60 శాతం సాగుచేస్తున్నారు. కాబట్టి ఈ తెగులు ఉనికి ప్రమాదకరంగా పరిణమించింది. టీఆర్-4 అనే ఈ పనామా తెగులు ఈ మధ్యకాలంలో మన భారతదేశంలో గమనించడం జరిగింది. 2016-17 సంవత్సరాల్లో బిహార్‌లోని పూర్ణియ, కటిహార్ జిల్లాల్లో మొదటగా గుర్తించారు. దీనిని టీఆర్-4గా నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ బనానా (ఎన్ఆర్‌సీబీ) తిరుచ్చిరాపల్లి శాస్త్రవేత్తలు ధృవీకరించడం జరిగింది. క్రమంగా ఈ సమస్యను బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో గమనించారు. అయితే మన రాష్ట్రంలో ఇప్పటి వరకు ఈ టీఆర్-4 పనామా తెగులు ఉనికిని గమనించలేదు. డా. వైఎస్ఆర్‌హెచ్‌ఓ, హెచ్ఆర్ఎస్, కొవ్వూరు శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు ఈ తెగులు గురించి సర్వేలను చేపడుతున్నారు. రైతులు ఈ సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకొని, సమస్యపైన సరైన అవగాహన ఏర్పర్చుకోవాలి. హెచ్ఆర్ఎస్, కొవ్వూరు శాస్త్రవేత్తలు వివిధ కార్యక్రమాల్లో, రైతు దినోత్సవాల్లో ఈ సమస్య ప్రాముఖ్యతను రైతుల దృష్టికి తీసుకువస్తున్నారు. గౌరవనీయులు ఉపకులపతి డా. టి జానకీరామ్, డా. వైబీఆర్‌హెచ్‌ఓ, డా. ఆర్‌వీఎస్‌కే రెడ్డి, పరిశోధనా సంచాలకులు, డా. వైఎస్ఆర్‌హెచ్‌ఓ అధ్యక్షతన ఈ సమస్యపై అవగాహన కోసం యూనివర్సిటీ శాస్త్రవేత్తలకు, రైతులకు వెబినార్‌ను జూలై 25వ తేదీన చేపట్టారు. దేశంలో నిష్ణాతులైన డా. కృష్ణకుమార్, Ex DDG డా. ఎస్. ఉమ, డైరెక్టర్ ఎన్ఆర్‌సీబీ, తిరుచ్చిరాపల్లి, డా. దామోదరన్, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ ఐసీఏఆర్-సీఎస్ఎస్‌సీఐ లక్నో వారి ద్వారా ఈ సమస్యపై జరుగుతున్న పరిశోధనలపై అవగాహన ఏర్పరిచారు. ఫ్యుజేరియం అనే ఈ శిలీంధ్రం నేలలో నివాసం ఏర్పరుచుకొని, వేర్లను ఆశించి మొక్కలోపలికి ప్రవేశిస్తుంది. మొక్కలోని నాళికా కణజాలాన్ని ఆశించి నీరు, పోషక రవాణాను అడ్డుకొని మొక్క చనిపోవడానికి దారితీస్తుంది. దేశవ్యాప్తంగా ఈ టీఆర్-4 పనామా తెగులుపై జరుగుతున్న పరిశోధనల్లో ఐసీఏఆర్- సీఎస్ఎస్ఆర్ఐ, లక్నో, ఐసీఏఆర్-ఎన్ఆర్‌సీబీ, ట్రిచీ, ఐసీఏఆర్-సీఐఎస్‌హెచ్ లక్నో ముందున్నాయి.

అఖిల భారత సాయిల్ సెలినిటీ (ఐసీఏఆర్-సీఎస్ఎస్ఆర్ఐ, లక్నో) వారు చేపట్టిన పరిశోధనల్లో ICAR-FUSICONT అనే జీవ శిలీంధ్రనాశిని ఉత్తరప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో గ్రాండ్‌నైన్ రకాన్ని ఆశించిన ఈ టీఆర్-4 పనామా తెగులును సమర్థవంతంగా అరికడుతున్నట్లు గమనించారు. చాలా మంది రైతులు పొలాల్లో ఈ మందును వాడి తెగులు తీవ్రతను తగ్గించడం జరిగింది. ఉద్యాన పరిశోధనా స్థానం కొవ్వూరులో కూడా ఈ ICAR-FUSICONT సామర్థ్యం గురించి పరిశోధనలు జరుగుతున్నాయి. మన రాష్ట్రంలో ఉన్న రేస్-1 పనామా తెగులుపై ఈICAR-FUSICONTను ఉపయోగించి పరిశోధనలు చేపట్టడం జరిగింది. మొదటి దశలో ఉన్న ప్రయోగాల్లో ఆశాజనకమైన ఫలితాలు వస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

ప్రజాప్రశ్న



# చరిత్ర సృష్టించిన మను భాకర్

ఈ పతకంతో 22 ఏళ్ల మను భాకర్ చరిత్ర సృష్టించింది. 2020 ఒలింపిక్స్‌లో భారీ అంచనాల మధ్య మూడు విభాగాల్లో పోటీ పడిన మను భాకర్.. అన్ని విభాగాల్లోనూ విఫలమై తీవ్రంగా నిరాశపర్చింది. కానీ ఈసారి మాత్రం పోటీపడ్డ తొలి ఈవెంట్‌లోనే కాంస్య పతకాన్ని సాధించి సత్తా చాటింది. మను ఈ ఒలింపిక్స్‌లో ఇంకో రెండు విభాగాల్లోనూ పోటీ పడనుంది. ఒలింపిక్స్ షూటింగ్ విభాగంలో పతకం సాధించిన తొలి భారత మహిళగా మను భాకర్ రికార్డ్ క్రియేట్ చేసింది. మను భాకర్ ఇప్పటికే తొమ్మిది సార్లు వరల్డ్ కప్ మెడల్స్ సాధించింది. షూటింగ్ విభాగంలో ఒలింపిక్ పతకం సాధించిన ఐదో భారత వ్యక్తిగా మను రికార్డుల్లోకి ఎక్కింది. పారిస్ ఒలింపిక్స్ మొదటి రోజు మహిళల పది మీటర్ల ఎయిర్ పిస్ట్ ఈవెంట్ క్వాలిఫికేషన్ రౌండ్లలో మను భాకర్ మూడోస్థానంలో నిలిచింది. క్వాలిఫికేషన్లో మను భాకర్ అత్యధికంగా 27సార్లు పర్ఫెక్ట్ స్కోర్లు నమోదు చేయడం గమనార్హం. వ్యక్తిగత విభాగంలో గత 20 ఏళ్లలో ఒలింపిక్ ఫైనల్ చేరిన తొలి భారత అథ్లెట్‌గా మను భాకర్ రికార్డు క్రియేట్ చేసింది. ఇంతకు ముందు సుమా షిరూర్ 2004లో జరిగిన ఏథెన్స్ ఒలింపిక్స్‌లో పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఫైనల్ చేరింది.

### ఒలింపిక్స్ పతకాలు సాధించిన భారత షూటర్లు..

1. రాజ్యవర్ధన్ రాథోడ్ – మెన్స్ డబుల్ ట్రాప్ – 2000 ఏథెన్స్ ఒలింపిక్స్ – రజతం
2. అభినవ్ బింద్రా – 10 మీ. ఎయిర్ రైఫిల్ – 2008 బీజింగ్ – స్వర్ణం
3. గగన్ నారంగ్ – 10 మీ. ఎయిర్ రైఫిల్ – 2012 లండన్ – కాంస్యం
4. విజయ్ కుమార్ – మెన్స్ 25 మీ. రాపిడ్ ఫైర్ పిస్టల్ – 2012 లండన్ – రజతం
5. మను భాకర్ – ఉమెన్స్ 10 మీ. ఎయిర్ పిస్టల్ – 2024 పారిస్ – కాంస్యం

# వచ్చే ఎన్నికల్లోనూ గుండు సున్నే

రూ.8.3 కోట్లు కేటాయించనున్నారు. మాడ్గుల మండల కేంద్రంలో భూగర్భ డ్రైనేజీ పనులకు రూ.7.75 కోట్ల నిధులు ఖర్చు పెట్టనుంది తెలంగాణ సర్కార్. మరోవైపు, బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు సీఎం రేవంత్. అధికారం కోల్పోయిన బాధ కేసీఆర్‌లో కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్నారు. ప్రజలు చీకొట్టినా కేసీఆర్, కేటీఆర్‌కు బుద్ధి మారలేదన్నారు. తమ ఎన్నికలు అయిపోయాని, వచ్చే పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ ఊరుకు తిరిగి తమ కార్యకర్తను గెలిపిస్తామన్నారు. అంతేగాక, త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీకి గుండుసున్నానే వస్తుందని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు.

### ఈ నెలాఖరులోపు రూ.1.5 లక్షల రుణమాఫీ

రెండో విడత కింద జూలై 31 లోపు రూ.1.5 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. తాను ఆగస్ట్ 2 నుండి 14వ తేదీ వరకు విదేశీ పర్యటనకు వెళ్తున్నానని తెలిపారు. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చాక.. ఆగస్ట్ నెలలోనే హామీ ఇచ్చినట్లుగా రూ. 2 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేస్తామని కల్వకుర్తి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. కల్వకుర్తి బహిరంగ సభలో రేవంత్ ఇంకా మాట్లాడుతూ 'ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్టు నేను ఎప్పటికీ మీ నల్లమల బిడ్డను. మీ సోదరుడిగానే ఉంటా. నమ్మిన సిద్ధాంతం ప్రకారం జైపాల్ రెడ్డి రాజకీయాలు చేశారు. అధికారంలో ఉన్నా లేకున్నా చివరి శ్వాస వరకు ప్రజా జీవితంలో ఉన్నారు. జైపాల్ రెడ్డి పదవులకే గౌరవం తెచ్చేలా వ్యవహరించారు. రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యతనిచ్చిన వ్యక్తి జైపాల్ రెడ్డి. కల్వకుర్తి నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యే అవకాశం చేజారిందని ఆనాడు జైపాల్ రెడ్డి బాధపడ్డారు. జైపాల్ రెడ్డి సూచన మేరకే ఆనాడు తలుపులు మూసి, లైవ్ కట్ చేసి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారు. ఆనాడు సీఎం అభ్యర్థిగా జైపాల్ రెడ్డి పేరు ప్రకటించింటే 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది. కాంగ్రెస్ మాట ఇస్తే చేసి తీరుతుంది. చెప్పిన ప్రకారం రైతులకు రుణమాఫీ చేసి తీరుతాం. కల్వకుర్తిలో 100 పడకల ఆసుపత్రి, ఆర్ అండ్ బీ రోడ్లు, గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం నిధులు ఇస్తున్నాం. ముచ్చెర్ల ప్రాంతంలో ఆగస్టు 1న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకోబోతున్నాం. అధికారం కోల్పోయిన బాధ బీఆరెస్ నేతల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతిపక్షం తన బాధ్యత సరిగ్గా నిర్వహించి ఉంటే కనీసం పంచాయతీ ఎన్నికల్లోనైనా ఛాన్స్ ఉంటుంది. కానీ ప్రజలు వారికి అవకాశం ఇవ్వరు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు సన్నద్ధం కావాలని' ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# రాజధానిలో విషాదం

వాపోతున్నారు. శ్రేయ అంకుల్ శుభాంగ్ యాదవ్ కోచింగ్ సెంటర్, అధికార యంత్రాంగం తీరును తీవ్రంగా తప్పుబట్టారు. శనివారం సాయంత్రం టీవీలో ఈ ఘటన గురించి తెలిసిందని వెంటనే శ్రేయకు కాల్ చేశామని కానీ మాట్లాడలేక పోయామని ఆవేదన చెందారు. 'ఈ ఘటనపై అటు కోచింగ్ సెంటర్ నుంచి కానీ ఇటు అధికారుల నుంచి కానీ ఎలాంటి సమాచారం లేదు. టీవీ వార్తల్లో చూసి మార్చురీ దగ్గరకు వెళ్లి మృతదేహాలను చూడాలని అడిగినా నిరాకరించారు. చివరకు మృతుల్లో శ్రేయాయాదవ్ పేరు ఉన్న పేపర్‌ను చూపించారు.' అంటూ వాపోయారు.

### తెలంగాణ విద్యార్థిని మృతి

కాగా, ఈ ఘటనలో తెలంగాణకు చెందిన విద్యార్థిని తానియా సోని (25) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆమె మృతి పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌లో ఉండే సోని తండ్రి విజయ్ కుమార్‌కు ఫోన్ చేసి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విద్యార్థిని భౌతిక కాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలోని తన కార్యాలయ అధికారులు.. అక్కడి పోలీసులు, ఇతర అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

### ఎఫ్ఐఆర్ నమోదు, ఇద్దరి అరెస్ట్

మరోవైపు, సివిల్స్ అభ్యర్థుల మృతి ఘటనపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటనపై వేర్వేరు దర్యాప్తు బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. కోచింగ్ సెంటర్ యజమాని అభిషేక్ గుప్తా, కోఆర్డినేటర్‌ను దేశ్ పాల్ సింగ్‌లను అరెస్ట్ చేసి వారిపై పలు సెక్షన్ల కింద రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు డీసీపీ హర్షవర్ధన్ తెలిపారు. కోచింగ్ సెంటర్‌లో స్టోర్ రూంను లైబ్రరీగా ఉపయోగిస్తున్నట్లు అగ్నిమాపక శాఖ నివేదిక ఆధారంగా గుర్తించామన్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముగిశాయని వెల్లడించారు. ఈ ఘటనలో అసలు ఏం జరిగిందో తెలుసుకోవడానికి సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

### కరోల్‌బాగ్‌లో విద్యార్థుల నిరసన

ఢిల్లీలో సివిల్స్ అభ్యర్థుల మృతి పట్ల విద్యార్థి లోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిర్లక్ష్యం వహించిన కోచింగ్ సెంటర్ యాజమాన్యం, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కరోల్ బాగ్ మెట్రో స్టేషన్ వద్దకు భారీగా చేరుకుని ఆందోళన చేశారు. నిరసనలు ఉద్ధృతం కాగా రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

# మూడు బ్యారేజీలు తప్ప కాళేశ్వరం మొత్తం వాడుకుంటాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇరిగేషన్ శాఖలో ఇక నుంచి ఒక కొత్త చాప్టర్ మొదలు పెడుతున్నామని.. ఆరున్నర లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లు ఇవ్వబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ కుంగింది ముమ్మాటికీ రీ- డిజైనింగ్, రీ- ఇంజినీరింగ్ వల్లేనని మంత్రి తేల్చిచెప్పారు. అంతటి నిర్వాకం జరిగింది మాజీ సీఎం కేసీఆర్ వల్లే జరిగిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ స్వయంగా ప్రాజెక్ట్ డిజైన్ చేశారంటూ గులాబీ దండు ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నారంటూ గుర్తుచేశారు. మేడిగడ్డకు నీళ్లు ఎందుకు పంపింగ్ చేయడం లేదని ప్రశ్నించిన కేటీఆర్‌కు మంత్రి కౌంటర్ ఇచ్చారు. కట్టినప్పుడూ, కూలినప్పుడు అధికారంలో ఉంది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అలాంటప్పుడు ఆ నెపం మరొకరి మీదకు నెట్టడం ఎంతవరకు కరెక్ట్ అని కొట్టిపారేశారు. వాస్తవాలను వక్రీకరించడం కేటీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా గ్లోబెల్స్ ప్రచారం ఆపాలని మంత్రి ఉత్తమ్ హితవుపలికారు. కాళేశ్వరంకు మేడిగడ్డ గుండెకాయ అని ప్రగల్బాలు పలికింది బీఆర్ఎస్ నేతలేనని అటువంటి బ్యారేజ్ కుంగినప్పుడు తీసుకున్న చర్యలు ఏమిటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 94 వేల కోట్లు ప్రజాధనాన్ని వినియోగించి 93 వేల ఎకరాలను కుడా సేద్యంలోకి తీసుకరాకపోవడమే కేసీఆర్ రీ–డిజైనింగ్, రీ–ఇంజినీరింగ్ గొప్పతనమా అని ప్రశ్నించారు. బ్యారేజ్‌ల నిర్మాణం సమయంలో సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి ఎందుకు తీసుకోలేదో వివరించాలన్నారు.మేడిగడ్డకు నీళ్లు పంపింగ్ చేసిన పక్షంలో జరగబోయే ప్రమాదాన్ని తలుచుకుంటేనే ఒళ్లుగగుర్పాటుకు గురవుతుందంటూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. జరగబోయే ఆస్తి నష్టం, ప్రాణ నష్టం అంతా ఇంతా అని చెప్పలేమన్నారు. సమ్మక్క సారక్క ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో పాటు సీతారాం ప్రాజెక్ట్ డ్యామేజ్ అవుతుందని తెలిపారు. అంతటితో ఆగకుండా సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉన్న భద్రాచలం పట్టణంతో పాటు 44 గ్రామాలు ముంపునకు గురవుతాయన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీళ్లు ఆపిన పక్షంలో.. ప్రమాదం జరిగితే ఎవరు భాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఒకవేళ ప్రమాదం జరిగితే భద్రాచలం రాముడి గుడి కూడా మునుగుతుందని హెచ్చరించారు. తమ ప్రభుత్వానికి ఎటువంటి దురాలోచన లేదని ఉన్నదల్లా దూరాలోచననే అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఉంటే గింటే ఆ దురుద్దేశాలు ఏవో బీఆర్ఎస్ వాళ్లకే ఉన్నందునే నిపుణులు చెప్పిన విషయాన్ని పక్కనపెట్టి పంపింగ్ డిమాండ్ చేస్తున్నారన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను ఏ విదంగా వినియోగంలోకి తీసుకురావాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం అన్నారు. కాళేశ్వరంలో మూడు బ్యారేజీలు తప్ప మిగతా అన్ని రిజర్వాయర్లను వాడుకుంటామన్నారు. ఇది ముమ్మాటికీ తెలంగాణా ప్రజల సొత్తని ప్రజలను తాకట్టు పెట్టి కట్టిన ప్రాజెక్ట్‌లని కాపాడుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# హిందువులు బిచ్చమెత్తుకోవాల్నా?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) "రంజాన్ పండుగకు రూ.33 కోట్లు కేటాయిస్తరు. తబ్లిగీ జామాతే సంస్థకు రూ.2.4 కోట్లు ఇస్తరు బోనాల పండుగ సందర్భంగా పాతబస్తీలోని దేవాలయాలకు రూ.5 లక్షలిస్తరా? హిందువులేమైనా బిచ్చగాళ్లనుకుంటున్నరా.? మీ దగ్గర బిచ్చమెత్తుకోవాల్నా?" అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి రాగానే గల్లీగల్లీలో అధికారికంగా బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు. పాతబస్తీ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్ గా మారుస్తామని ఉద్ఘాటించారు. బోనాల పండుగ సందర్భంగా పాతబస్తీలోని వివిధ ఆలయాల సందర్శనలో బిజీబిజీగా ఉన్న బండి సంజయ్ తొలుత భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 'గౌలిపురా'లో ప్రధానమంత్రి 'మన్ కీ బాత్' ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించారు. అంతకుముందు భాగ్యలక్ష్మీ ఆలయ సమీపంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు తెలంగాణ ఆడబిడ్డలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు ఇయాళ భాగ్యనగర్ ఆషాడ మాసం సందర్భంగా గల్లీగల్లీలో ప్రారంభమైన బోనాల జాతర రాష్ట్రవ్యాప్తంగా భక్తియుత ధార్మిక వాతావరణంలో వైభవంగా నిర్వహించుకుంటున్నాం. అన్ని కుటుంబాలు కలిసి సామూహికంగా ఆ తల్లికి బోనం సమర్పించుకుంటున్నాం. బోనం అంటే అమ్మవారికి ఇష్టంగా సమర్పించే నైవేద్యం. నైవేద్యం సమర్పిస్తే కష్టాలు తీరుతాయని నమ్మకం. 1908లో మూసీ నది వరదలతో హైదరాబాద్ మొత్తం అతలాకుతలమైతే ఇట్లనే అమ్మవారికి మొక్కుకుంటే తగ్గిపోయింది. అప్పటి నుండి లాల్ దర్వాజా అమ్మవారికి బోనాల ఉత్సవాలను జరపడం ఆనవాయితిగా మారింది. భాగ్యనగరాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ ఎల్లవేళలా రక్షిస్తున్న మన భాగ్యలక్ష్మీసహా అమ్మవార్లందరినీ దర్శించుకునేందుకు ఇక్కడికి రావడం ఆనందంగా ఉంది. 1869లో హైదరాబాద్‌లో ప్లేగ్ వ్యాధితో జనం పిట్టల్లా రాలిపోతుంటే ఈ వ్యాధి తగ్గితే అమ్మవారికి గుడి కట్టించి బోనాలు జరుపుతామని అప్పటి జవాన్లు, ప్రజలు మొక్కుకున్నారు. అమ్మవారి దయతో ఆ వ్యాధి తగ్గిపోవడంతో సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి గుడి కట్టించి ఘనంగా బోనాల ఉత్సవాలు జరుపుకుంటున్నం.ఈ పండుగకు ఓ సైంటిఫిక్ రీజన్ కూడా ఉంది. ఈ వానా కాలంలో అనేక రోగాలు పుట్టుకొస్తయ్. బోనం చుట్టూ పసుపు పూస్తం. వేపాకులు కడ్తం. దీనివల్ల బ్యాక్టీరియా, వైరస్ లు నాశనమై మన ఆరోగ్యం పైలంగా ఉంటదని నమ్ముతం. నేను ఇయాళ ఇటొస్తుంటే ఓ పెద్దాయన నాతో ఏమన్నడంటే నాకు పాతబస్తీని చూస్తే గుబులు పట్టుకుంది. యాకత్ పురా కోమటివాడ, చందులాల్ బారాదరి, చావునిసహా పాతబస్తీలో చాలా ప్రాంతాల్లో ఇప్పుడు బోనాలు జరుపుకునేందుకు పరిస్థితి లేదని బాధపడ్డడు. ఇతర ప్రాంతాల్లో బోనాల పండుగకు హాజరయ్యే దుస్థితి ఏర్పడిందని వాపోయాడు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమే. పాతబస్తీలోనే కదా గల్లీగల్లీలో, బస్తీబస్తీలో అధికారికంగా ప్రతి ఏటా బోనాల పండుగ జరుపుకునే అవకాశం రావాలంటే అన్ని వర్గాలను సమానంగా చూసే బీజేపీ ప్రభుత్వం రావాలి. అది కచ్చితంగా వచ్చి తీరుతుంది. దురదృష్టమేమిటంటే ప్రభుత్వాలు మారినా వివక్ష, సంతుష్టీకరణ విధానాలు మాత్రం మారడం లేదు పాతబస్తీలో బోనాల పండుగ నిర్వహణ కోసం 24 దేవాలయాలతో కమిటీ ఉంటే రూ.5 లక్షలు మాత్రమే ఇవ్వడం దారుణం. బిచ్చమెత్తుకునే దుస్థితి ఏర్పడింది. బోనాల పండుగకు వచ్చి పేపర్లకు ఫోజులిచ్చి గొప్పలు చెప్పుకోవడం కాదు బోనాల పండుగకు ఎన్ని నిధులు కేటాయించినమని ఆత్మవిమర్శ చేసుకోవాలి. రంజాన్ పండుగకు రూ.33 కోట్లు ఇస్తున్నట్లు బడ్జెట్ లో ప్రతిపాదించారు.. మేమైనా వద్దన్నమా? ఇంకా రూ.10 కోట్లు ఇచ్చుకోండి. కానీ హిందూ పండుగలకు ఎందుకివ్వరు? బోనాలు, గణేష్ ఉత్సవాలతోపాటు నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటాం కదా... ఎందుకు నిధులివ్వరు? భాగ్యలక్ష్మీ అమ్మవారి ఉత్సవాలకు ఎందుకు నిధులివ్వరు? బీజేపీ అధికారంలోకి వస్తే భాగ్యలక్ష్మీ ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్ గా మార్చి తీరుతామన్నారు. తబ్లిగీ జమాతే వంటి నిషేధిత సంస్థలకు కాంగ్రెస్ ప్రభుత్వం 2 కోట్ల 4 లక్షలిచ్చిందంటే ఏమనాలి? ఇదేనా సెక్యూలరిజమంటే ఇదేదో దేశానికి సేవ చేసినట్లు బడ్జెట్ లో ప్రస్తావించిన్రు, సిగ్గుండాలే హిందువులంత పనికిరాకుండా పోయారా? ఇంత స్థాయికి దిగజారాలా? ఇట్లనే వ్యవహరించిన గత పాలకుల పరిస్థితి ఏమైందో అర్థం చేసుకోవాలి. నేను వాస్తవాలు మాట్లాడితే మతతత్వవాది అంటారా? అయినా సరే బరాబర్ మాట్లాడతా. నేనేమీ మతానికి వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. సనాతన ధర్మాన్ని కించపరిస్తే మాట్లాడి తీరుతా. హిందువులను బిచ్చగాళ్లగా చూడొద్దు. ఇకనైనా అన్ని వర్గాలను సమానంగా చూడాలని కోరుతున్నా. గతంలో మజ్లిస్ నేత కేసీఆర్ ను అంకుల్ అనే వాడు ఇప్పుడు రేవంత్ రెడ్డిని అన్న అని సంబోధిస్తున్నడు. అన్నదమ్ముల సంబంధం మొదలైందేమో మజ్లిస్ నేతలు గోడమీద పిల్లులు. ఎవరు అధికారంలో ఉంటే వాళ్ల పంచన చేరడం వాళ్లకు అలవాటే. మొన్నటిదాకా కాంగ్రెస్ ను తిట్టి బీఆర్ఎస్ గడీలకు పోయిన్రు. ఇప్పుడు బీఆర్ఎస్ ను తిట్టి కాంగ్రెస్ పంచన చేరతరు. ఎందుకంటే వాళ్లు చేసే వ్యాపారాలు బాగుండాలే. ఓల్డ్ సిటీలో ట్యాక్స్ లు, బిల్లులు కట్టొద్దనే భావన వాళ్లది అట్లాంటోళ్లకు మద్దతిస్తరా? సిగ్గుచేటన్నారు.కొడంగల్ వాళ్ల అయ్య జాగీరా? పంచుకోవడానికి కొడంగల్ లో పోటీ చేస్తే డిపాజిట్ రాకుండా చేస్తాం ఒక్కో కాషాయ కార్యకర్త, ఒక్కో యువకుడు ఇంటికి ఇంఛార్జీగా ఉంటూ ఆ రెండు పార్టీల అడ్రస్ గల్లంతు చేస్తం 15 నిమిషాలు సమయమిస్తే హిందువులను నరికి చంపుతానన్న వ్యక్తిని డిప్యూటీ సీఎం పదవిస్తానని చెప్పడం సిగ్గు చేటు' అని బండి సంజయ్ అన్నారు.

# కుతుబ్ షాహీ టూంబ్స్‌ను సందర్శించిన రేవంత్

ముగింపు నేడు జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "తెలంగాణ ప్రభుత్వం, ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ఆధ్వర్యంలో జరుగుతున్న పునరుద్ధరణ ప్రాజెక్ట్ ముగింపు కార్యక్రమంలో మీ అందరితో కలిసి పాల్గొనడం నాకు ఆనందంతో పాటు గౌరవంగా ఉంది. వేల సంవత్సరాల నాటి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలతో నిండిన తెలంగాణ కు మీలో ప్రతి ఒక్కరికి స్వాగతం. శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్ షాహీలు మరియు ఇతరులు ఈ ప్రాంతాన్ని పాలించారు. ప్రతి ఒక్కరు వారి ప్రత్యేకమైన సాంస్కృతిక ముద్రను వేశారు. చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్‌షాహి సమాధులు, పైగా సమాధులు, వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, అలంపూర్ దేవాలయాలు వంటివి వాస్తు అద్భుతాలకు తెలంగాణ నిలయంగా ఉంది.శతాబ్దాలుగా హైదరాబాద్ 'గంగా–జమునా తెహజీబ్'గా పిలుస్తూ బహుళ జాతులు, సంస్కృతుల సామరస్యాన్ని, సహజీవనాన్ని చూసింది. కుతుబ్ షాహీ హెరిటేజ్ పార్క్ , సెవెన్ టూంబ్స్ ఔట్స్ షాహిన్ రాజవంశం నిర్మాణ నైపుణ్యానికి , సాంస్కృతిక గొప్పతనానికి నిదర్శనంగా నిలుస్తాయి. మన ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని కాపాడటం తో పాటు ప్రపంచ పటంలో సగర్వంగా ఉంచుతుంది. యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ ప్రదేశం రామప్ప దేవాలయానికి తెలంగాణ గర్వకారణం. 2013లో ఎంఓయూతో ప్రారంభించి,100 కంటే ఎక్కువ స్మారక చిహ్నాల పరిరక్షణ తో పాటు 106 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన ఈ కార్యక్రమం అతిపెద్ద పరిరక్షణ ప్రయత్నానికి నిదర్శనం. ఆఘాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ సహకారానికి , ఉదారతకు తెలంగాణ ప్రభుత్వం , హైదరాబాద్ ప్రజల తరపున అభినందనలు , కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నేను ఈ సందర్భంగా హాజరైన విశిష్ట అతిథులందరికీ, ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్ కి ధన్యవాదాలు" అని రేవంత్ రెడ్డి అన్నారు.

# మత్స్యకారుల వలకు భారీ సొర

ఒడ్డుకు చేర్చేందుకు శతవిధాలా ప్రయత్నించారు. చివరకు సాధ్యం కాక క్రేన్ సాయంతో తరలించారు. భారీ చేపను చూసేందుకు స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. టేకు చేపలు అత్యంత అరుదుగా దొరుకుతాయని ఆయుర్వేద మందుల తయారీకి ఈ చేపను వాడతారని మత్స్యాకారులు తెలిపారు. చెన్నైకు చెందిన వ్యాపారులు ఈ బాహుబలి చేపను కొనుగోలు చేసినట్లు చెప్పారు. కాగా, ఇంతటి భారీ చేపను తరలిస్తోన్న దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# బాధ్యతా రాహిత్యమే మరణాలకు కారణం

విద్యార్థి మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యమే. సంస్థల బాధ్యతా రాహిత్యం వల్ల సాధారణ ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. సురక్షితంగా జీవించడం దేశంలోని ప్రతీ పౌరుడి హక్కు. దాన్ని అందించడం ప్రభుత్వాల బాధ్యత' అని రాహుల్ పేర్కొన్నారు.

# క్రేంద్రం నుండి ఏపీకి రూ.80 వేల కోట్లు

అమరావతి నిర్మాణంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని కేంద్ర మంత్రి పెమ్మసాని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగానే కేంద్రం కూడా పూర్తిగా సహకరిస్తోందని చెప్పుకొచ్చారు. అందులో భాగంగానే ఏపీకి రూ.80 వేల కోట్ల నిధులు వివిధ ప్రాజెక్టుల రూపంలో వస్తున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. రూ.2500 కోట్లతో అమరావతి రైల్వే లైన్ ఇప్పటికే మంజూరైందని రూ.15 వేల కోట్ల విలువైన అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపిందని పెమ్మసాని గుర్తుచేశారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు కూడా కేంద్రం సహకరిస్తుందని చెప్పుకొచ్చారు. వీటితో పాటుగా ఇండస్ట్రియల్ కారిడార్లు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇలాంటి వన్నీ కలిపి వివిధ ప్రాజెక్టుల కింద ఏపీకి రూ.80 వేల కోట్ల నిధులు వస్తున్నాయని కేంద్ర మంత్రి శుభవార్త వినిపించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా మరిన్ని నిధులను రాబట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పుకొచ్చారు.

# పభుత్వ పథకాల పేర్ల మార్పుపై పవన్ హర్షం

తెలిపారు. వైసీపీ హయాంలో జగన్ అన్నింటికీ తన పేరే పెట్టుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడంతో వారికి సమున్నత గౌరవం ఇచ్చామని చెప్పారు. బడిపిల్లల సామగ్రి పథకానికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ, విద్యార్థులకిచ్చే ప్రతిభా పురస్కారాలకు అబ్దుల్ కలాం పేరు పెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆ మహనీయుల ఆశీస్సులు మా ప్రభుత్వానికి ఎప్పుడూ ఉంటాయని పవన్ పేర్కొన్నారు.

### పథకాల పేర్లు మార్పు

కాగా, రాష్ట్రంలో పలు పథకాల పేర్లు మారుస్తూ ప్రభుత్వం శనివారం నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని.. ఈ క్రమంలో సమూలంగా ప్రక్షాళన చేయాలని భావిస్తున్నట్లు ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో విద్యాలయాలను రాజకీయాలకు అతీతంగా సరస్వతీ నిలయాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నట్లు చెప్పారు. గత వైసీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ పేరుతో అమలు చేసిన పథకాలకు మహనీయుల పేర్లు పెడుతున్నామని స్పష్టం చేశారు.

- జగనన్న అమ్మ ఒడి పథకాన్ని 'తల్లికి వందనం'గా మార్చారు.
- జగనన్న విద్యా కానుక – సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర
- జగనన్న గోరు ముద్ద – డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం
- మన బడి నాడు నేడు – మన బడి – మన భవిష్యత్తు
- స్వేచ్ఛ – బాలికా రక్షజగనన్న ఆణిముత్యాలు – అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారంగా మారుస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమక్షంలో

# కాంగ్రెస్ పార్టీ లోకి భారీగా చేరికలు



యాదగిరగుట్ట(ప్రశ్న న్యూస్) యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం పల్లె పహాడ్ గ్రామం నుండి ఆలేరు మండలం పటేల్ గూడెం గ్రామం నుండి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లోకి చేరారు.ప్రజాపాలనలో అభివృద్ధి సాధ్యం అవుతుందని,ఆరు గ్యారెంటీ లు అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ లోకి చేరినవారిలో పటేల్ గూడెం గ్రామం నుండి గవ్వల సంతోష్..బిఅరెస్ పార్టీ యువజన సీనియర్ నాయకుడు ,వస్పరి ఐలయ్య బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు, ఆత్మకూరు మండలం పల్లె పహాడ్ గ్రామం నుండి మిర్యాల వెంకటేష్, విరసోమయ్య, అంభోజు, కనకయ్య ,ప్రశాంత్, అశోక్, తదితరులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

# రెండున్నర గంటల్లో 21 కిలోమీటర్ల పరుగు

### జగిత్యాల కమిషనర్ సమ్మయ్య రికార్డ్




జగిత్యాల(ప్రశ్న న్యూస్)సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ ఫ్రీ పేరిట నిర్వహించిన ఆఫ్ మారతాన్ పరుగు పోటిలో జగిత్యాల మునిసిపల్ కమిషనర్ రికార్డును సాధించారు. ప్రజలందరూ ఆరోగ్య వంతమైన జీవనానికి, ఫిట్నెస్ పెంచుకోవడానికి ప్రతి రోజూ ఉదయం వాకింగ్ రన్నింగ్ చేయాలని సూచించారు. డ్రగ్స్ ను నిషేధించాలని కోరారు.

# బ్యాంకాక్‌లో నంద్యాల జిల్లా వాసి కిడ్నాప్.. 8 లక్షలు ఇవ్వాలని డిమాండ్!




బ్యాంకాక్‌లో నంద్యాల జిల్లా వాసి కిడ్నాప్‌నకు గురవ్వడం కలకలం రేపింది. ఉద్యోగరీత్యా బ్యాంకాక్‌కు వెళ్లిన మధుకుమార్‌ను కొంతమంది దుండగులు అపహరించారు. అనంతరం అతని కుటుంబసభ్యులకు ఫోన్ చేసి రూ.8లక్షలు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నంద్యాల జిల్లా డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన మధు కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఉద్యోగరీత్యా ఈ నెల 24న బెంగళూరు నుంచి అతను బ్యాంకాక్ వెళ్లాడు. ఆ తర్వాత ఈ నెల 25న మధు కుమార్ మొబైల్ నుంచి తన అక్క రాజ్యలక్ష్మి ఓ మెసేజ్ వచ్చింది. తనను కొంతమంది కిడ్నాప్ చేశారని, రూ.8 లక్షలు ఇస్తే వదులుతామని.. లేదంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని వచ్చిన ఆ మెసేజ్ చూసి రాజ్యలక్ష్మి కంగారుపడింది. వెంటనే మధుకుమార్‌కు కాల్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో భయపడిపోయిన మధుకుమార్ తల్లిదండ్రులు డోన్ రూరల్ పోలీసులను ఆశ్రయించారు. బ్యాంకాక్‌లో నంద్యాల జిల్లా వాసి కిడ్నాప్ అయ్యాడని వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మధు పనిచేస్తున్న కంపెనీలోనూ పోలీసులు విచారిస్తున్నారు. నిజంగానే మధుకుమార్ బ్యాంకాక్ వెళ్లాడా? లేదా? అన్న వివరాలను ఎయిర్‌పోర్టులో అధికారులను కోరారు. వాళ్లిచ్చే సమాచారం కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. అలాగే సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కూడా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# విక్కీ కౌశల్, తృప్తి డిమ్రి బ్యాడ్ న్యూజ్ మైల్‌స్టోన్



విక్కీ కౌశల్, యానిమల్ ఫేం తృప్తి డిమ్రి కాంబోలో వచ్చిన చిత్రం బ్యాడ్ న్యూజ్ అమ్మి విర్క్ మరో లీడ్ రోల్ పోషించాడు. ఆనంద్ తివారి దర్శకత్వం వహించిన ఈ మూవీలో నేహా ధూపియా కీలక పాత్రలో నటించింది. జులై 19న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ మూవీకి మంచి స్పందన వచ్చింది.తాజా అప్‌డేట్ ప్రకారం ఈ చిత్రం శుక్రవారం రూ.2.22 కోట్లు రాబట్టింది. శనివారం రూ.3.52 కోట్లు రాబట్టగా.. ఈ ఫిగర్‌తో మొత్తం కలెక్షన్లు రూ.49.86 కోట్లకు చేరాయి. సెకండ్ వీకెండ్ కల్లా బ్యాడ్‌న్యూజ్ రూ.50 కోట్ల క్లబ్‌లోకి ఎంటరవడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. హాలీవుడ్ సూపర్ హీరో ఫిల్మ్ డెడ్‌పూల్ అండ్ వాల్వెరిన్ థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో బ్యాడ్ న్యూజ్ ప్రయాణం ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది.ఈ మూవీని ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ వీడియో (పోస్ట్ థియాట్రికల్)లో స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్లు, ప్రమోషన్స్ తో సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేశాయి. మరోవైపు %ఝబఝ ఝబఝ% సాంగ్ నెట్టింటిని షేక్ చేస్తోంది. పాపులర్ సింగర్, ర్యాపర్ విక్కీ కౌశల్ కాంబోలో తొలిసారి వస్తున్న ఈ పార్టీ యాంథెమ్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మ్యూజిక్ అండ్ మూవీ లవర్స్.

# మోక్షజ్ఞ ఎంట్రీకి మైథలాజికల్ కథ సిద్ధం!



నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ సినిమాల్లో ఎంట్రీకి రంగం సిద్ధం అయిన సంగతి తెలిసిందే. ఈ నందమూరి వారసుడు మోక్షజ్ఞ అరంగేట్రం కోసం గత కొంత కాలంగా బాలకృష్ణ సరైన దర్శకుని కోసం అన్వేషించి ఆ అవకాశాన్ని ప్రశాంత్ వర్మకు ఇచ్చారు. హనుమాన్ సినిమాతో తన టాలెంట్ ను పాన్ ఇండియా లెవెల్ లో నిరూపించుకున్నాడు ప్రశాంత్ వర్మ . గతంలో తీసిన జాంబీ రెడ్డి చిత్రం కూడా భారీ విజయాన్ని సాధించింది. మొత్తానికి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కోసం సరైన దర్శకున్నే ఎంచుకున్నాడని అభిమానుల అభిప్రాయం. ఈ దర్శకుడు మోక్షజ్ఞ కోసం ఒక మైథలాజికల్ కథను సిద్ధం చేసినట్లు సమచారం.

ప్రశాంత్ వర్మ నందమూరి మోక్షజ్ఞ తో చేయబోయే సినిమా చాలా ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ ను సిద్ధం చేశారని టాక్ . మహాభారతంలోని ఒక ధైర్యవంతుడు అయిన ఒక వీరుని కథ ఆధారంగా చేసుకుని ఈ మైథలాజికల్ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. కాగా ఈ కథ గురించి హైలెట్స్ వింటుంటే%ొ% ఈ చిత్రం చరిత్ర సృష్టిస్తుంది అని ఫిల్మ్ ఇండస్ట్రీలో అంచనాలు మొదలైయ్యాయి. మొత్తం మీద ఓ సంచలనానికి రంగం సిద్ధం చేస్తున్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. నందమూరి మోక్షజ్ఞ తో చేయబోయే ఈ ప్రాజెక్ట్ ను బాలకృష్ణ రెండో కూతురు తేజశ్విని నిర్మించబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ దర్శకుడు ఇటీవల దాదాపు 30 కోట్ల వ్యయంతో స్వంత ప్రొడక్షన్ ఆఫీస్‌ని కూడా నిర్మించుకుంటున్నాడని సమాచారం. ఈ ఆఫీసులో వంద మంది వరకు వివిధ శాఖలకు చెందిన వారు ఈ ఆఫీసులో పని చేస్తారట. తన సినిమాకు సంబంధించిన ప్రతి పని, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఈ ఆఫీసులోనే జరిగేటట్లు ఏర్పాట్లు చేసుకుంటున్నాడని తెలిసింది.

# సొగసు చూడతరమా..

## ట్రెండింగ్‌లో భాగ్యశ్రీ బోర్సే స్టిల్స్, విజువల్స్



రవితేజ టైటిల్ రోల్ పోషిస్తోన్న మిస్టర్ బచ్చన్ సినిమాతో టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్‌పై ఎంట్రీ ఇవ్వబోతుంది పూణే సుందరి భాగ్యశ్రీ బోర్సే హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. ఆగస్టు 15న మిస్టర్ బచ్చన్ విడుదల కానుంది. కాగా తెలుగులో తొలి సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో దేవుడికి పూజలు చేసి ఆశీస్సులు అందుకుంది.సంప్రదాయ చీరకట్టులో నెత్తిన మల్లెపూలు పెట్టుకొని అందానికే అసూయ పుట్టేలా ఉన్న భాగ్యశ్రీ బోర్సే విజువల్స్, స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మోడ్రన్ డ్రెస్‌లో, చీరకట్టులో హొయలుపోతూ తెలుగు ప్రేక్షకుల మతులు పోగొడుతోంది. ఇప్పటికే రవితేజ, భాగ్య శ్రీ బోర్సే కాంబోలో విడుదలైన సితార్, రెప్పల్ డప్పుల్ సాంగ్స్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది.తొలి సినిమా విడుదల కాకముందే విజయ్ దేవరకొండ VD12, దుల్కర్ సల్మాన్ సినిమాల్లో నటించే అవకాశం కొట్టేసిందని ఇప్పటికే నెట్టింట వార్తలు వస్తున్నాయి.

# ఖండాంతరాల్లో తేజ సజ్జా హనుమాన్..

## ప్రశాంత్ వర్మ కొత్త ట్రైలర్




టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం హనుమాన్ . ప్రశాంత్ వర్మ (%ాథిుయిత్ష్త్ర ఝతీఝ%) దర్శకత్వంలో తేజ సజ్జా తొలి పాన్ ఇండియా సినిమాగా వచ్చిన ఈ చిత్రం జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైంది. తొలి తెలుగు సూపర్ హీరో సిరీస్‌గా రిలీజైన హనుమాన్ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. ఇప్పుడిక ఈ చిత్రానికి కొనసాగింపుగా జై హనుమాన్ కూడా ట్రాక్‌పై ఉన్నదని తెలిసిందే.చాలా కాలానికి హనుమాన్ మరోసారి వార్తల్లో నిలిచింది. హనుమాన్ ఇక ఖండాంతరాల్లో కూడా తన సత్తా చాటేందుకు రెడీ అయింది. ఈ చిత్రం జపనీస్ భాషలో కూడా సందడి చేయనుంది. అక్టోబర్ 4న జపాన్‌లో గ్రాండ్‌గా విడుదల కానున్నట్టు తెలియజేశాడు ప్రశాంత్ వర్మ. జపాన్‌లోని పలు థియేటర్లలో సినిమా తెలుగు వెర్షన్ జపనీస్ సబ్ టైటిల్స్‌తో స్క్రీనింగ్ కానున్నట్టు తెలిపాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ స్పెషల్ ట్రైలర్ కూడా విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. హనుమాన్ తెలుగు రాష్ట్రాల్లో 25 సెంటర్లలో 100 బ్లాక్ బస్టర్ డేస్‌ను కూడా పూర్తి చేసుకుంది. హనుమాన్ ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ జీ 5 (తెలుగు) లో, జియో సినిమా (హిందీ)లలో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ చిత్రంలో కోలీవుడ్ భామ అమృతా అయ్యర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. వరలక్ష్మి శరత్ కుమార్, వినయ్ రాయ్, రాజ్ దీపక్ శెట్టి, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి గౌరా హరి-అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్ సంయుక్తంగా మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. ఈ మూవీని శ్రీమతి చైతన్య సమర్పణలో ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కే నిరంజన్ రెడ్డి తెరకెక్కించారు.

# అజిత్ కుమార్ విదాముయార్చి

## నయా పోస్టర్..

### యాక్షన్ కింగ్ లుక్ షేర్ చేసిన మగిజ్ తిరుమేని టీం

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ క్రేజీయెస్ట్ ప్రాజెక్ట్ విదాముయార్చి . ఏకే 62గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఏదో ఒక అప్‌డేట్ పోస్టర్‌ను రిలీజ్ చేస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌ను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు అజిత్‌కుమార్. ఇప్పటికే మూడు పోస్టర్లు విడుదల కాగా నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ సార్జా కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. తాజాగా అర్జున్ ఫస్ట్ లుక్‌ను షేర్ చేశారు మేకర్స్. అర్జున్ స్టైలిష్ లుక్‌లో రోడ్డుపై నిలబడి ఉండటం పోస్టర్‌లో చూడొచ్చు. ఈ స్టిల్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు.తల అజిత్ కుమార్ ఖాతాలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలున్నాయని తెలిసిందే.

ఈ చిత్రం తర్వాత అజిత్ కుమార్ అధిక్ రవిచంద్రన్ డైరెక్షన్‌లో నటిస్తోన్న ఏకే 63 షూట్‌లో జాయిన్ కాబోతున్నాడు. గుడ్ బ్యాడ్ అగ్లీ టైటిల్‌తో రానున్న ఈ సినిమాపై కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది.



# కెప్టెన్ మిల్లర్ వర్సెస్ రాయన్..

## ధనుష్‌కు పర్‌ఫెక్ట్ బర్త్ డే గిఫ్ట్ ఇదే




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ టైటిల్ రోల్ పోషించిన కెప్టెన్ మిల్లర్ ఈ ఏడాది జనవరి 12న గ్రాండ్‌గా విడుదలైన విషయం తెలిసిందే. అరుణ్ మథేశ్వరన్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన కెప్టెన్ మిల్లర్ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. ధనుష్ తాజాగా రాయన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు.స్వీయ దర్శకత్వంలో టైటిల్ రోల్ పోషించగా.. సూపర్ హిట్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతూ మాస్ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతోంది. తాజాగా రాయన్ అరుదైన ఫీట్ నమోదు చేసింది. రాయన్ మూడు రోజుల గ్లోబల్ గ్రాస్ కెప్టెన్ మిల్లర్‌ను అధిగమించనుంది. తాజా అప్‌డేట్ ప్రకారం రాయన్ రెండు రోజుల గ్లోబల్ వసూళ్లు రూ.50 కోట్లకుపైగా నమోదయ్యాయి. ధనుష్‌కు ఇదే సరైన బర్త్ డే గిఫ్ట అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.డీ50వ (%ణ%50)గా తెరకెక్కిన రాయన్ చిత్రంలో అపర్ణ బాలమురళి, దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, ఎస్‌జే సూర్య , కాళిదాస్ జయరామన్, సందీప్ కిషన్, సెల్వ రాఘవన్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మించారు. విప్లవయోధుడు కెప్టెన్ మిల్లర్ స్ఫూర్తితో వస్తోన్న ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్, కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, టాలీవుడ్ యాక్టర్ సందీప్ కిషన్, నివేదితా సతీశ్, ఎడ్వర్డ్ సొన్నెన్‌బ్లిక్ ఇతర కీలక పాత్రలు పోషించారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు.

# బీఆర్ఎస్ఎల్పీ విలీనంలో

# రేవంత్ ఫెయిల్.?

## - ఇక చేరికలు లేనట్లేనా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఒకరొకరుగా పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరారు. పదకొండో ఎమ్మెల్యే కూడా చేరబోతున్నారని ఓ సారి హడావుడి చేశారు. ఇంకా చెప్పాలంటే అసెంబ్లీ ఎన్నికల్లోపు బీఆర్ఎస్ ఎల్పీ విలీనం అవుతుందని ఆ పార్టీలో ముగ్గురు, నలుగురు ఎమ్మెల్యేలు కూడా ఉండరని కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి వరకూ గంభీరమైన ప్రకటనలు చేశారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హెూదా లేకుండా చేస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి, ముగిశాయి ప్రతిపక్ష నేత హెూదాలో ఓ సారి కేసీఆర్ సభకు వచ్చి వెళ్లారు. కానీ మరో ఎమ్మెల్యే చేరిక మాత్రం జరగలేదు.

### బీఆర్ఎస్ ఎల్పీ విలీనం లేనట్లే

భారత రాష్ట్ర సమితి ఎల్పీని విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేతలు చాలా తీవ్రంగా ప్రయత్నించారు. అయితే వారి ప్రయత్నం సఫలం కాలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది రేవంత్ తో సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నారు కానీ పార్టీలో చేరే విషయంలో మాత్రం ఏ విషయం చెప్పడం లేదు. రేవంత్ సీఎం కాబట్టి ఆయనను ధిక్కరించలేరు అలాగని పార్టీలో చేరిపోతామని కూడా చెప్పడం లేదు. అనివార్య పరిస్థితుల్లో కొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అలాంటి వారు పది మంది ఉన్నారు. మరో పదిహేను మందిని అయినా చేర్చుకుంటే తప్ప ఎల్పీ విలీనం కాదు. ఆ పదిహేను మంది ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. వారెవరో మాత్రం క్లారిటీగా లేదు. అయితే కాంగ్రెస్ మైండ్ గేమ్ ఆడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విలీనమయ్యే స్థాయిలో కాంగ్రెస్‌లలో చేరే పరిస్థితి లేదని క్లారిటీ వచ్చేసినట్లయింది.

### బీజేపీ, బీఆర్ఎస్ మధ్య డీల్‌పై ప్రచారమే కీలక కారణం

వచ్చే కొద్ది నెలల్లో తెలంగాణ రాజకీయాలు మారిపోతాయని ఓపిక పట్టాలని పార్టీ ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ పెద్దలు సర్ది చెబుతున్నారు. ముఖ్యంగా భారతీయ జనతా పార్టీతో జరుగుతున్న చర్చల గురించి బీఆర్ఎస్ పెద్దలు చెబుతున్నట్లుగా తెలుస్తోంది. కొద్ది నెలల్లో ప్రభుత్వాన్ని మార్చేద్దామన్న నమ్మకం కలిగేలా పార్టీ ఎమ్మెల్యేలకు బ్రెయిన్ వాష్ చేస్తున్నారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం లేదా పొత్తుల గురించి ఎంతగా ప్రచారం జరిగుతున్నా మౌనం అర్థాంగీకారం అన్నట్లుగా రెండు పార్టీల నేతలు మౌనంగా ఉంటున్నారు. అసలు అలాంటిదేమీ లేకపోతే మరో మాట లేకుండా ఖండించేవారు. అలాంటి ఖండన ప్రకటనలు రాకపోవడంతో నిజంగానే చర్చలు జరుగుతున్నాయన్న నమ్మకంతో ఎమ్మెల్యేలు ఉన్నారు. రేపు కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత.. ఇలాంటి పరిస్థితి వస్తే ఇబ్బంది పడతామని జరిగే పరిణామాలను బట్టి వేచి చూడాలని అనుకుంటున్నారు. ఈ కారణంగా చేరికలు కాంగ్రెస్ అనుకున్నంత జోరుగా సాగలేదు.

### కొంటున్నామని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేసినట్లుగా ప్రచారం

మరో వైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఐదు నుంచి పది కోట్లకు కొంటున్నామని అంత కంటే ఎక్కువ ఖరీదు పెట్టడం లేదని చేసినట్లుగా చెబుతున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కాంగ్రెస్ పార్టీని నమ్మి తాము పార్టీలో చేరితే తామేదో డబ్బులకు అమ్ముడుపోయామన్నట్లుగా ప్రచారం చేయడం ఏమిటని వారు అసంతృప్తికి గురవుతున్నట్లుగా చెబుతున్నారు. రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో చేశారో కానీ వచ్చిన ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నారు. మిగిలిన ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ లో చేరి అమ్ముడుపోయామన్న పేరు తెచ్చుకోవడం ఎందుకని సైలెంట్ అయిపోయే పరిస్థితులు ఉన్నాయి. కాంగ్రెస్ రాజకీయాలు ఎప్పటికప్పుడు భిన్నంగా ఉంటాయి. అలాంటి పార్టీలో చేరాలంటే ఒకటికి పది సార్లు ఆలోచించే పరిస్థితిని కల్పిస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. మొత్తంగా ఇప్పుడు స్థానిక ఎన్నికలపై ఆలోచన చేయాల్సిందే కానీ ఇక చేరికల గురించి వద్దని కాంగ్రెస్ పెద్దలు కూడా ఓ నిర్ణయానికి వస్తున్నారు.

## జీఎస్టీ కుంభకోణంలో 5వ నిందితుడిగా

# మాజీ సీఎస్ సోమేశ్

- కేసు నమోదు చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు
- తెలంగాణ వాణిజ్య శాఖ జాయింట్ కమిషనర్ ఫిర్యాదు ఆధారంగా కేసు
- ఇప్పటికే నిందితులుగా ఉన్న పలువురు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జీఎస్టీ కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్‌ను పోలీసులు 5వ నిందితుడిగా చేర్చారు. ఈ మేరకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పన్ను ఎగవేతదార్లకు సహకరించడంతో వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయంటూ ఆ శాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదయిన విషయం తెలిసిందే. వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వర రావు, డిప్యూటీ కమిషనర్(హైదరాబాద్ రూరల్) శివ రామప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఇప్పటికే ఈ కేసులో నిందితులుగా చేర్చారు. కాగా వాణిజ్య పన్నుల శాఖలో పెద్ద ఎత్తున పన్ను ఎగవేతలు జరిగినట్టుగా తెలుస్తోంది. ఒక్క తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ ఎగవేత ద్వారా ఏకంగా రూ.1,000 కోట్లకుపైగా నష్టం జరిగినట్టు తెలుస్తోంది. మరో 11 ప్రైవేటు సంస్థలు దాదాపు రూ. 400కోట్లు పన్ను చెల్లింపులు ఎగవేసినట్టు ఆ శాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి ఫిర్యాదులో తెలిపారు. మరోవైపు మానవ వనరులను అందించే 'బిగ్‌లీప్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఏమాత్రం టాక్స్ కట్టకుండానే ఏకంగా రూ.25.51కోట్ల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకుందని, అవకతవకలు జరిగాయని తేలిన నేపథ్యంలో అంతర్గతంగా విచారణ జరిపినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. వాణిజ్యపన్నులశాఖకు సాంకేతికతను అందించే సర్వీస్ ప్రొవైడర్‌గా ఐఐటీ హైదరాబాద్ వ్యవహరించింది. తెలంగాణలో పన్ను చెల్లింపుదారులు నమోదు చేసే ఐటీ రిటర్న్‌ల్లో అక్రమాలను గుర్తించడంతోపాటు డేటాను విశ్లేషించడం సర్వీస్‌ప్రొవైడర్ చేయాల్సిన పని. పన్నుచెల్లింపుదారుల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సర్వీస్ ప్రొవైడర్ రూపొందించిన 'స్క్రూటినీ మాడ్యూల్' గుర్తించాల్సి ఉంటుంది. కానీ బిగ్‌లీప్ టెక్నాలజీస్ అక్రమాలను ఐఐటీ హైదరాబాద్ అందిస్తున్న ఐఐటీ హైదరాబాద్ 'స్క్రూటినీ మాడ్యూల్' కూడా గుర్తించలేకపోయిందని వివరించారు.

# సిగ్గు సిగ్గు జగన్! ఇంత పిరికితనమా

- వైఎస్ షర్మిల సంచలనం - ప్రతిపక్ష హెూదా ఇవ్వకుంటే అసెంబ్లీ వెళ్లనన్న జగన్
- అన్న తీరుపై తీవ్రంగా మండిపడిన సోదరి వైఎస్ షర్మిల - శాసనసభకు వెళ్లకుంటే రాజీనామా చేయాలని డిమాండ్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రతిపక్ష హెూదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతానని జగన్ అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని ఆమె విమర్శించారు. ఈ మేరకు జగన్‌ను ఉద్దేశించి ఎక్స్ (ట్విట్టర్),లో షర్మిల విమర్శలు గుప్పించారు."సిగ్గు సిగ్గు!! ప్రతిపక్ష నాయకుడి హెూదా ఇస్తేనే శాసనసభలో అడుగుపెడతానని అనడం మీ అజ్ఞానానికి నిదర్శనం ఇంతకుమించిన పిరికితనం, చేతకానితనం, అహంకారం ఎక్కడా ఉండదు మోసం చేయడం మీకు కొత్తేమీ కాదు. కానీ మిమ్మల్ని ఎన్నుకుని, పంపిన ప్రజలను ఇలా వెర్రిగా, వింతగా మోసం చేయడం ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను అవమానించడం మీకే చెల్లింది అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజాస్వామ్యాన్ని హేళన చేయడం మీ దివాళాకోరుతనం ఎమ్మెల్యే అంటే అర్థం మెంబెర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ, నాట్ మెంబెర్ ఆఫ్ మీడియా అసెంబ్లీ. ఎమ్మెల్యేగా గెలిచింది చట్టసభల్లో ప్రజల గొంతుక కావడానికా? మీడియా ముందు సొంత డబ్బా కొట్టుకోడానికా? మీ ఐదేళ్ల పాలనంతా అవినీతి, దోపిడీ రాష్ట్రాన్ని మీరు అప్పుల కుప్ప చేసి పెట్టారని నిండు సభలో అధికార పక్షం శ్వేతపత్రాలు విడుదల చేస్తుంది మీరు మాత్రం ప్యాలెస్‌లో తాపీగా కూర్చుని మీడియా మీట్‌లు పెడుతున్నారు మిమ్మల్ని ప్రజలు ఎమ్మెల్యేను చేసింది ఇందుకు కాదు మీ పాలనపై విమర్శలకు అసెంబ్లీలో ఆన్ రికార్డు సమాధానం ఇచ్చుకునే బాధ్యత మీది కాదా? ప్రజలకు అన్యాయం జరిగితే అధికార పక్షాన్ని ఫ్లోర్ ఆఫ్ ది హౌస్‌లో ప్రశ్నించే బాధ్యత మీది కాదా? అసెంబ్లీకి పోనని చెప్పే మీరు.. ప్రతిపక్ష హెూదాకే కాదు, ఎమ్మెల్యే హెూదాకు కూడా అనర్హులు. వెంటనే రాజీనామా చేయండి.స్కూల్‌కు పోను అనే విద్యార్థికి టీసీ ఇచ్చి ఇంటికి పంపుతారు ఆఫీసు ఎగ్గొట్టే పనిదొంగను వెంటనే పనిలోంచి తీసేస్తారు మరి ప్రజాతీర్పును గౌరవించకుండా, శాసనసభకి పోను అంటూ గౌరవ సభను అవమానించిన వాళ్లకు ఎమ్మెల్యేగా ఉండే అర్హత లేదు. ప్రజాప్రతినిధిగా అసెంబ్లీకి వెళ్లనపుడు మీరు ఆఫ్రికా అడవులకు పోతారో అంటార్కిటికా మంచులోకే పోతారో ఎవరికి కావాలి? అసెంబ్లీకి పోని జగన్ అండ్ కో తక్షణం ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం' అని షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు ప్రతిపక్ష హెూదా ఇచ్చేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన



విషయం తెలిసిందే. స్పీకర్‌ను ఆయన లేఖ కూడా రాశారు. ఈ నేపథ్యంలో షర్మిల సెటైర్లు వేశారు.

## క్రైస్తవులారా బయటకొచ్చి ఓటు వేయండి..
## ఆ సమస్య పరిష్కారం అవుతుంది: డొనాల్డ్ ట్రంప్

- క్రిస్టియన్లు అంటే ఇష్టమన్న ట్రంప్
- తనకు ఓటు వేస్తే ఆ సమస్య పరిష్కారం అవుతుందని హామీ
- స్పష్టంగా అర్థం కాని ట్రంప్ వ్యాఖ్యల పరమార్థం



**అమెరికా ప్రశ్నన్యూస్:** ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం జోరందుకుంది. డెమొక్రాటిక్ పార్టీ నామినీగా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారీస్ ఖరారైన తర్వాత ప్రచార కార్యక్రమాలు మరింత ఊపందుకున్నాయి. ఈ క్రమంలో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం క్రిస్టియన్లను ఉద్దేశించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "క్రైస్తవులారా.. ఈసారి కచ్చితంగా బయటకు వచ్చి ఓటు వేయండి. నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ఓటు వేస్తే వచ్చే నాలుగేళ్లలో మళ్లీ ఓటు వేయాల్సిన అవసరం ఉండదు. మరో నాలుగేళ్లలో అది పరిష్కారం అవుతుంది. అదేంటో మీకు తెలుసు. క్రైస్తవులారా మీరంటే నాకెంతో ఇష్టం. నేను కూడా క్రైస్తవుడని. నేను మిమ్మల్ని అభిమానిస్తున్నాను. మీరంతా బయటకు వచ్చి ఓటు వేయండి. ఆ సమస్యను చక్కగా పరిష్కరిద్దాం. అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో 'టర్నింగ్ పాయింట్ యాక్షన్' అనే సంప్రదాయ గ్రూప్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రంప్ ఈ మేరకు మాట్లాడారు. కాగా ఈ వ్యాఖ్యల ద్వారా ట్రంప్ ఏం చెప్పదలుచుకున్నారో స్పష్టంగా అర్థం కావడంలేదని అమెరికా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే ట్రంప్ ప్రచార ప్రతినిధి స్టీవెన్ చియుంగ్ మాట్లాడుతూ.. అమెరికాను ఏకం చేయడం గురించి ట్రంప్ మాట్లాడారని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు స్పష్టమైన అర్థం తెలియక పోయినప్పటికీ ఈ వ్యాఖ్యలపై డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇదిలావుంచితే.. గత రెండు ఎన్నికల్లో క్రైస్తవుల ఓట్లు డొనాల్డ్ ట్రంప్‌నకు అనుకూలంగా పడ్డాయి.

# నగరానికి న్యూ లుక్

## - జీహెచ్ఎంసీ కమిషనర్ కీలక నిర్ణయం



**హైదరాబాద్ :** హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో తమ సంస్థ కార్యలకపాలు సాగిస్తున్నాయి. ప్రపంచ నగరాలతో పోటీ పడుతూ దూసుకెళ్తుంది. ఈ నేపథ్యంలో నగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. మూసీ నది ప్రక్షాళన, హైడ్రా, నగర సుందరీకరణ, గార్డెనింగ్ తదితర అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే నగరానికి కొత్త రూపు తీసుకొచ్చే అంశంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ సిటీ సుందరీకరణ, పచ్చదనం (గార్డెనింగ్) పెంపునకు సంబంధించి మెరుగైన విధానాల రూపకల్పనపై ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఇద్దరు ఐఏఎస్ అధికారులు, ఓ పురపాలకశాఖ ఉన్నతాధికారితో కలిపి కమిటీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెరుగైన పద్ధతులను గుర్తించాలని కమిటీకి ఆమ్రపాలి దిశానిర్దేశం చేశారు. ఇవే కాకుండా నగర అభివృద్ధిపై మరో రెండు కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిలతో కలిపి ఈ కమిటీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరంలోని ఆకర్షణీయ ప్రాంతాలను, ప్రాజెక్టులను గుర్తించి, నగరవ్యాప్తంగా వాటిని అమలు చేయడానికి గల సాధ్యాసాధ్యాలతో ఒక నివేదిక ఇవ్వాలని ఆమ్రపాలి వారికి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీలో ఉమెన్ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది సంక్షేమానికి, వారి రక్షణకు సంబంధించిన అంశాలపైనా కూడా అధ్యయనం చేసి నివేదించాలని కమిషనర్ కమిటీని ఆదేశించారు. అదనపు కమిషనర్లు స్నేహ శబరీష్, నళిని పద్మావతి, పంకజ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గల పార్కులు, నర్సరీలు, రోడ్డు డైవర్షన్లు, ప్రధాన కూడళ్లు, తదితర ప్రదేశాల అభివృద్ధికి ఎదురయ్యే సమస్యలను గుర్తించటం.., ఆ సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించాలని కమిషనర్ ఆమ్రపాలి మరో కమటీని కూడా ఏర్పాటు చేశారు. కమిటీలో ఎల్బీనగర్ జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్, చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న, జీవవైవిధ్య విభాగం అదనపు కమిషనర్ సునందరాణి సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

## ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా

# పలు రైళ్లు రద్దు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఈ నెల 29 నుంచి 31 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ అధికారులు ప్రకటించారు. దౌండ్ సెక్టార్లో ఇంటర్ లాకింగ్ పనులు చేపడుతున్నందున సెంట్రల్ రైల్వే పలు రైళ్లను మూడు రోజుల పాటు రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఈ డివిజన్ లో మొత్తం 62 రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు వివరించారు. ఇందులో సికింద్రాబాద్ డివిజన్ కు సంబంధించి జూన్ 29న పుణే-సికింద్రాబాద్ (ట్రైన్ నెం.12025), జులై 30న సికింద్రాబాద్-లోకమాన్య తిలక్ టెర్మినస్ (ట్రైన్ నెం.1220) దౌండ్-నిజామాబాద్ (ట్రైన్ నెం.11409) రైళ్లను రద్దు చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588